అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
శనివారం 17 ఆగస్టు 2024 పేజీలు : 04

- అడుగడుగునా అవినీతే.. అధికారులదీ అదే రీతే.!
- సభ్యుల అమాయకత్వమే అక్రమాలకు పెట్టుబడి..!
- రామరాజుపల్లిలో యానిమేటర్ అక్రమాలకు అధికారుల వత్తాసు

యానిమేతలపై చర్యలేవి..?

యాడికిలోని స్త్రీశక్తి భవనం, సభ్యులు ప్రాధేయపడితేనే ఏర్పాటు చేస్తున్న సమావేశాలు, పొదుపుఖాతాల్లో జమచేయని బ్యాంకు ధరావతు పత్రాలు




సభ్యురాలు కట్టకపోయినా కట్టినట్లు రాసిన మినిట్ పుస్తకం, మినిట్ పుస్తకంలో కట్టినట్లు, బ్యాంకు ఖాతాల్లో కట్టనట్లున్న స్టేట్‌మెంట్

యాడికి(తాడిపత్రి), ఆగస్టు 16, ప్రభాతవార్త: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం ద్వారా సంఘాలను స్థాపించింది. వీటిలో పదిమంది సభ్యులను గ్రూపుగా ఏర్పాటు చేసి వారిచే ప్రతి నెలా కొంత మొత్తాన్ని పొదుపు చేయించి, బ్యాంకుల ద్వారా రుణాలు కల్పించి వారిచే చిరువ్యాపారాలు స్థాపింపజేసి ఆర్థిక భరోసా కల్పించాలనేది సంఘాల ముఖ్యోద్దేశం. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. పేద మహిళలు కూలీ నాలీ చేసుకొని కష్టపడి సంపాదించిన సొమ్మును కొందరు యానిమేటర్లు గద్దల్లా తన్నుకుపోతున్నా వారిపై కనీస చర్యలు ఉండటం లేదు. డ్వాక్రా సంఘాల సభ్యులకు బ్యాంకు ఖాతాలు, ఆర్థిక లావాదేవీల నిర్వహణలో ఆసరగా ఉండేందుకు గ్రామ సంఘాల తీర్మానాల ఆధారంగా సహాయకులుగా యానిమేటర్లను నియమించారు. మొదట్లో సక్రమంగా విధులు నిర్వహించినప్పటికీ కొందరు అధికారుల అండదండలతో అక్రమాలకు తెరలేపారు. దీంతో గ్రామీణ మహిళలు లక్షలాది రూపాయలు నష్టపోవాల్సి వస్తోంది.

– రామరాజుపల్లిలో అక్రమాలకు అధికారుల వత్తాసు: యాడికి మండలం రామరాజుపల్లిలో మహాలక్ష్మి సంఘంలో జరిగిన అవకతవకలపై విచారించమని అధికారులను ప్రాధేపడిన వారం రోజులకు గాని సంబంధిత అధికారులు స్పందించలేదంటేనే సంఘాలపై అధికారుల పర్యవేక్షణ ఏపాటిదో ఇట్టే అర్థమవుతోంది. ఒక సభ్యురాలు జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల బ్యాంకు లింకేజీ కంతులు కట్టకున్నా కట్టినట్లు తీర్మానంలో పుస్తకంలో రాసి యానిమేటర్ మభ్యపెట్టాడు. సభ్యులకు అనుమానం రేకెత్తి బ్యాంకు స్టేట్‌మెంట్ తీసుకుంటే అందులో జనవరి, ఫిబ్రవరి, మార్చినెలల కంతులు ఒక సభ్యురాలు కట్టనేలేదు. ఈ విషయం బహిర్గతమవుతోందని తెలిసి ఆ సభ్యురాలితో మూడు నెలలకు సంబంధించిన రూ. 12 వేలకు రూ. 400 లు వడ్డీ కలిపి జులైలో చెల్లించేలా చేశాడు. ఈవిషయాన్ని అధికారుల వద్ద ప్రస్తావిస్తే తీర్మానం పుస్తకంలో పొరపాటున రాశాను అని యానిమేటర్ అనగానే అధికారులు కూడా తందానా అంటూచేతులు దులుపుకున్నారు. బ్యాంకురుణం పొందాలంటే ఇంకా చెల్లించాల్సింది రూ. 84 వేలు ఉండగా ఒక్కొక్కరితో రూ. 12 వేలు వంతున రూ. 1.20 లక్షలు కట్టించినా అధికారులు నోరు మెదకపోవడం గమనార్హం. సభ్యుల పుస్తకాల్లో కట్టినట్లు రాసిన ఒక కంతు సొమ్ము పత్తాలేకుండా పోవడం, దిగిపోతున్న సభ్యురాలు చెల్లించిన మిగతా 3 లో...

నగరంలో నిర్బంధపు వసూళ్లు, బెదిరింపులు ఎక్కువయ్యాయి..

- రాజకీయ జోక్యం ఎక్కువైంది - మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి - జిల్లా ఎస్పీని కలిసి సమస్యలు వివరించిన వైనం

అనంతపురం ఆగస్టు 16 ప్రభాతవార్త బ్యూరో

అనంతపురం నగరంలో నిర్బంధపు వసూళ్లు, బెదిరింపులు ఎక్కువయ్యాయని, రాజకీయ జోక్యంకూడా ఎక్కువైందని అన్ని కోణాల్లో పరిశీలించి అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టిడిపి నేత, అనంతపురంమాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి శుక్రవారం అనంతపురంజిల్లా పోలీసు అధికారులను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆ వినతిపత్రంలో ప్రభాకర్‌చౌదరిఎస్పీ దృష్టికి తీసుకుపోయిన వివరాలు ఇలా ఉన్నాయి.. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం, ఈ నెల 13వ తేదినఎన్టీఆర్‌కేంద్ర కార్యాలయంలో ఫిర్యాదుల విభాగంలో వినతులు స్వీకరించే కార్యక్రమంలో పాల్గొన్నాను. అదే రోజు నాపైన సోషల్ మీడియాలో, నాకు సంబంధం లేని, ఎన్నడూ నేను చూడని ఒక వ్యక్తి ద్వారా, బియ్యం అక్రమ వ్యాపారంలో భాగస్వామి అయ్యాడని,నా అనుచరుడని వీడియో పోస్ట్ చేయడంజరిగింది. ఓ బాధ్యతాయుతమైన పౌరుడిగా, అందులో అనంతపురంలో పుట్టి పెరిగిన వ్యక్తిగా, ప్రజల పట్ల సమాజం పట్ల, అనంతపురం పట్ల, నాకు ప్రత్యేకమైన శ్రద్ధాశక్తులు ఉన్నాయి. అందులో ప్రజాప్రతినిధిగా వివిధ స్థాయిల్లో అనంత ప్రజలు ఆదరించారు. అందులకు ప్రత్యేక బాధ్యత నాకు ఉంది. కావున కొన్ని ఆసక్తికరమైన, అత్యంత ప్రమాదకరమైన విషయాలను మీకు తెలియజేస్తున్నానన్నారు. అనంతపురం నగరం విద్యా వంతులు,, మేధావులు, ప్రజాస్వామ్యాన్ని ఆకాంక్షించే పౌరులకు, ఆవాసం నివాసం. పార్టీ పరంగా ప్రభుత్వ పరంగా ముఖ్యమంత్రి ఆలోచనలకు, లక్ష్యాలకు భిన్నంగా కొన్ని సంఘటనలు జరుగుతున్నా మౌనంగానే గమనిస్తున్నాను. గత ప్రభుత్వంలో అనేక వ్యయ ప్రయాసాలకు ఓర్చి ఐదేళ్లు శ్రమించి పోరాటం సాగించామన్నారు. ఫలితంగా నాపై నాతో పాటుగా నాయకులు, కార్యకర్తలపై కేసులు బనాయించారన్నారు. మెరుగైన సమాజం కోసం అవే ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడిగా దేశ వ్యాప్తంగా నిజాయితీ పరుల్ని సత్కరిస్తూ గౌరవిస్తూ కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నానన్నారు. రాయలసీమలోని ముఠాకక్షలకు చరమగీతం పాడాలని ఉద్యమించాం. దురదృష్ట వశాత్తు నేడు నగరంలోనే స్థానికేతరులు తిష్ట వేసి, అరాచక శక్తులను చేరదీసి, పార్టీ కార్యకర్తలని, నాయకుల్ని కొందరిని లక్ష్యంగా చేసి మద్యం మత్తులో దుర్భాషలాడుతూ భయానక వాతావరణం కల్పిస్తున్నారు. గోరుచుట్టపై రోకలి పోటులా, ఆగస్టు 1వ తేది 2024, పాతూరుకు సంబంధించిన కురుబ బుల్లె మాధవి అనే మహిళ, అక్కడ స్థానిక యూనిట్ అధ్యక్షుడు వాల్మీకి రంగా ద్వారా (గత మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన కుటుంబం), నన్ను సంప్రదించారు. ఎవరో ఫోన్ ద్వారా బెదిరిస్తున్నారు, ఓ ప్రజాప్రతినిధి సమీప బంధువుని అంటున్నారు. ప్రజా ప్రతినిధికి చెప్పండి అని ప్రాదేయపడ్డారు. ఆ ఆడియో సారాంశం నేను విన్న తర్వాత పరిస్థితి గమనించి పార్టీ దృష్టికి పంపాను. ఈ ఆడియో లీక్ కావడం తెలుసుకున్న ప్రజా ప్రతినిధి అనుచరులు పదిమంది, రెండు మూడు రోజుల తర్వాత స్థానిక 4వ పోలీస్‌స్టేషన్‌కు మిగతా 4 లో...

మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి

అనంతపురం జిల్లా నూతన ఎస్పీగా జగదీష్

అనంతపురం, ఆగస్టు 16 ప్రభాతవార్త ప్రతినిధి

అనంతపురం జిల్లా నూతన ఎస్పీగా జగదీష్‌ని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అనంతపురం జిల్లా ఎస్పీగా పని చేస్తున్న కేబి మురళీకృష్ణను విశాఖపట్నంలోని 16వ బెటాలియన్‌కు బదిలీ చేశారు. ఏపిలో పది మంది ఐపిఎస్‌ల బదిలీ గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్‌గా సుమిత్ గరుడ్ అనంతపురం ఎస్పీగా జగదీష్ ఎస్పీ మురళీ కృష్ణ 16వ బెటాలియన్‌కు బదిలీ ఇంటెలిజెన్స్ ఎస్పీ సత్య ఏసుబాబును.. హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ అయినట్లు తెలిపారు.

'అభయ'కు తక్షణ న్యాయం చేయాలి

- కోల్‌కతాలో వైద్యురాలి హత్యపై వెల్లువెత్తిన నిరసనలు - జిల్లా వ్యాప్తంగా ధర్నాలు, నిరాహారదీక్షలు
- అనంతలో జూనియర్ డాక్టర్ల విధుల బహిష్కరణ - న్యాయం చేయాలని గళమెత్తిన విద్యార్థినులు

న్యాయం చేయాలని నిరాహార దీక్ష చేస్తున్న జూనియర్ డాక్టర్లు

అనంతపురం, ఆగస్టు 16, ప్రభాతవార్త ప్రతినిధి

పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో జూనియర్ డాక్టరుపై అతా్యచారం, హత్య ఘటనపై దేశవ్యాప్తంగా నిరసన వ్యక్తమవుతున్నాయి. కోల్‌కతా అర్జీ కార్ ప్రభుత్వ వైద్య కళాశాలలో పీజీ రెండో సంవత్సరం చదువుతున్న ట్రైనీ వైద్యురాలు నైట్ డ్యూటీ చేస్తున్న సమయంలో కొందరు దుండగులు అత్యాచారం, హత్య చేశారు. పోస్టుమార్టం నివేదికలో ఈ ఆటవిక చర్య ఒక్కరే చేయగలిగినదిగా లేదని, చెబుతున్నారు. ఇంత వరకు నిందితులను పట్టుకున్నది లేదు. హత్యాచార ఉదంతంలో విస్తుగొలిపే విషయాలు వెలుగు చూశాయి. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ, సత్వరమే నిందితులకు కఠిన శిక్ష విధించాలని కోరుతూ అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఈ నెల 17వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 18వ తేదీ ఉదయం 6 గంటల వరకు అన్ని హాస్పిటల్‌లో వైద్య సేవలను బంద్ చేస్తున్నట్టు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రకటించింది. అన్ని మండలాల్లోను, నియోజకవర్గ కేంద్రాల్లోను, జిల్లా కేంద్రా ల్లోను జూనియర్ డాక్టర్లు, వైద్యులు, విద్యార్థులు, యువతులు కోల్‌కత్తా ఘటనపై నిరసన వ్యక్తం చేశారు. పుర వీధుల గుండా ర్యాలీలు నిర్వహిస్తు న్నారు. ప్లకార్డులు పట్టుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతున్నారు. ఇలాంటి ఘటనలు మళ్లి పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అనంతపురం నగరంలో మెడిక ల్ కాలేజీ విద్యార్థులు, జూనియర్ డాక్టర్లు టవర్‌క్లాక్ ఎదుట నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై కోల్‌కతాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న నిర్లక్ష్య ధోరణిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట జూనియర్ డాక్టర్లు ధర్నా చేపట్టారు. నిరాహారదీక్ష చేపట్టారు. కోల్‌కతాలో జూనియర్ డాక్టరుపై జరిగిన అత్యాచారం, హత్య ఘటనను పి.వి.కె.కె. ఐటి కళాశాల విద్యార్థులు తమ గళాన్ని వినిపించారు. నిందితులను తక్షణమే కఠినంగా శిక్షించాలని, బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జూనియర్ డాక్టర్లు చేస్తున్న నిరాహారదీక్షకు తమ సంఘీభావం ప్రకటించారు.

సిబిఐతో దర్యాప్తు చేపట్టాలి

షేక్ గౌసియాభాను, బీటెక్ ఫైనల్ ఇయర్, సిఎస్‌జి, పివికెకె కళాశాల

కోల్‌కత్తాలో పీజీ వైద్య విద్యార్థినిపై అత్యాచారం, హత్య ఘటన దారుణం. విద్యార్థినిని హత్య చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి. వైద్య విద్యార్థులకే కాదు, దేశ వ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు, యువతులకు, మహిళలకు రక్షణ కరువైంది. ఈ ఘటనపై సిబిఐ దర్యాప్తు వేయాలి. పోస్టుమార్టం రిపోర్టులో కూడా విస్మయకర విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇలాంటి దాడులను అరికట్టేందుకు కఠిన చట్టాలు, చట్టం ప్రకారం సత్వరం శిక్ష పడేలా ఏర్పాట్లు వ్యవస్థలో చేయాల్సిన అవసరం ఎంతో ఉంది. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సత్వరం స్పందించి పని చేయాలి. ఇలాంటి అన్యాయం ఇంకెవరికీ జరగడానికి వీలు లేకుండా చర్యలు తీసుకోవాలి. స్త్రీ తన పని చేసే స్థలంలో రక్షణ పొందలేనప్పుడు, బయటి సమాజంలో రక్షణ దొరుకుతుందని ఎలా ఆశించగలం. ప్రభుత్వ ఆస్పత్రి ముందు బాధితురాలి కుటుంబానికి న్యాయం జరగాలని డిమాండ్ చేస్తూ ధర్నా, నిరాహార దీక్ష చేస్తున్న జూనియర్ డాక్టర్లకు పివికెకె కళాశాల నుంచి సంఘీభావం తెలుపుతున్నాం.

ప్రజారోగ్య వ్యవస్థకే ప్రమాదం...

టి.వనజాక్షి, బీటెక్ సెకెండ్ ఇయర్, ఇఇఇ, పివికెకె కళాశాల

విద్యార్థినులకు, మహిళా ఉద్యోగులకు పూర్తి స్థాయి భద్రత కల్పించలేని నిర్వాకం. ముఖ్యంగా వైద్య వైద్యరంగంలో పని చేస్తున్న వారు ఆరోగ్య సేవలు అందించడంలో ఎంతో శ్రమ పడుతున్నారు. వైద్య విద్యార్థినిపై దాడి మాత్రమే కాదు ప్రజారోగ్య వ్యవస్థకే ప్రమాదం. హత్యోదంతం విషయంలో అక్కడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వలు వెంటనే స్పందించి బాధితురాలి కుటుంబానికి మిగతా 3 లో...

అన్న క్యాంటీన్లు ప్రారంభం

- జిమ్ చేసి..ఆర్టీసి బస్సు నడిపిన ఎమ్మెల్యే బాలకృష్ణ - బాలయ్యతో మంత్రి, ఎస్పి సమావేశం

అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే బాలయ్య , జ్ఞాపికను అందచేస్తున్న మంత్రి సవితమ్మ , బాలయ్యతో సమావేశమైన ఎస్పి, డిఎస్పి, సిఐలు

హిందూపురం, ఆగస్టు 16 ప్రభాతవార్త

హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ శుక్రవారం విస్తృతంగా పర్యటించి ప్రారంభోత్సవాలు, భూమిపూజ తదితర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి, చిన్నమార్కెట్ ప్రాంతాల్లో గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన అన్న క్యాంటీన్‌ను జగన్ ప్రభుత్వం మూసివేయగా మరలా వాటిని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎంపినిధులతో లేపాక్షి మండలం మానేపల్లిలో నిర్మించిన కమ్యూనిటీహాల్‌ను ప్రారంభించారు. స్థానిక మెయిన్‌బజార్‌లో అర్థాంతరంగా నిలిచిపోయిన మసీదు నిర్మాణ భవనాన్ని పరిశీలించారు. పట్టణంలోని పశువులఆసుపత్రి ప్రాంగణంలో 15 లక్షల రూపాయలతో నిర్మించనున్న మందుల దుకాణానికి భూమిపూజచేశారు. అదేవిధంగా సాయంత్రం 4 గంటలకు స్థానిక ఆర్టీసి బస్టాండ్‌లో తిరుపతి, కర్నూల్‌వెళ్లే నూతన బస్సులను ఎమ్మెల్యేతోపాటు రాష్ట్రబిసి సంక్షేమశాఖ మంత్రి సవితమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్టీసి బస్సును బాలయ్య స్వయంగా డ్రైవింగ్ చేయడంతో అభిమానులు, టిడిపి కార్యకర్తలు జై బాలయ్య అంటూ నినాదాలు చేశారు. అంతకు ముందు ఒక జిమ్ కేంద్రాన్ని ప్రారంభించగా ఎంతో ఉత్సాహంగా బాలయ్య వ్యాయామం చేయడంతో అభిమానులు కేరింతలు కొట్టారు.

ఆర్టీసి బస్సు నడుపుతున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

బాలయ్య క్యాంపు కార్యాలయంలో మంత్రి, ఎస్పి : ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి రాష్ట్ర బిసి సంక్షేమశాఖామంత్రి సవితమ్మ మర్యాద పూర్వకంగా విచ్చేసి ఎమ్మెల్యే బాలకృష్ణతో మాట్లాడారు. అదేవిధంగా సాయంత్రం జిల్లా ఎస్పి రత్న కూడా బాలయ్యతో బేటీ అయి పుష్పగుచ్ఛం అందచేశారు. కాగా వివిధ విభాగాలకు చెందిన అధికారులు బాలయ్యను కలిసి పుష్పగుచ్చాలు అందించారు. ఎమ్మెల్యే పర్యటనలో కలెక్టర్ టిఎస్ చేతన్, పెనుకొండ సబ్‌కలెక్టర్ అపూర్వభరత్, ఎమ్మెల్యే కార్యదర్శులు డాక్టర్ సురేంద్ర, శ్రీనివాసరావు, బాలాజీ, జిల్లా టిడిపి అధ్యక్షులు అంజనప్ప, మున్సిపల్‌మాజీచైర్మన్, కౌన్సిలర్ విపక్షనేత డిఇ రమేష్‌కుమార్, చంద్రమోహన్‌యాదవ్, మున్సిపల్ కౌన్సిలర్లు రాఘవేంద్ర, సతీష్‌కుమార్, తదితరులు, వైసిపి నుండి టిడిపిలోకి చేరిన కౌన్సిలర్లు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, వివిధ విభాగాలకు చెందిన అధికారులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

అట్టడుగుస్థాయి వ్యక్తి జీవితాన్ని మార్చాలన్నదే విజన్ 2047 ముఖ్య లక్ష్యం

-జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్

శ్రీసత్యసాయిజిల్లా, ఆగస్టు 16, ప్రభాతవార్త ప్రతినిధి: అట్టడుగు స్థాయి వ్యక్తి జీవితాన్ని మార్చేలా ఉండాలన్నదే ప్రభుత్వం విజన్ 2047 యొక్క ముఖ్య లక్ష్యమని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని మీకోసం సమావేశ మందిరం నందు సిపిఓ ఆధ్వర్యంలో విజన్ 2047పై జిల్లాలోని అన్ని శాఖలకు చెందిన హెచ్‌ఓడిలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ కొండయ్య, సిపిఓ విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రానున్న రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో అన్ని రంగాల్లో మార్పులు వస్తాయని, ప్రతి సామాన్యుడికి ఫలాలు అందాలంటే రాష్ట్ర స్థాయి నుండి మండల, కుటుంబ స్థాయి వరకు ఒక యూనిట్‌గా ప్రణాళికలురచించాలన్నారు. అప్పుడే విజన్ డాక్యుమెంట్‌కు సార్థకత చేకూరుతుందని, విజన్ 100 రోజుల డాక్యుమెంట్ రూపకల్పనకు అన్ని శాఖల అధికారులు సహకరించాలన్నారు. జిల్లాలో అందుబాటులో ఉన్న వనరులు, పరిస్థితులు, అభివృద్ధికిగల అవకాశాలను, పేర్కొంటూ ఈ 100 రోజుల డాక్యుమెంట్ రాయాలన్నారు. ఆరోగ్యం, సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి, సామాజిక పురోగతి, పర్యావరణ సుస్థిరత, స్థిరమైన అభివృద్ధి వివరాలను పొందుపరచాలని, హెచ్‌ఓడిలను ఆదేశించారు. ప్రజా వేదిక పరిస్కార కార్యక్రమంలో పైవిషయాలపై సంబంధిత జిల్లాలోని ఆయా శాఖల హెచ్‌ఓడిలతో చర్చించడం జరుగుతుందని, ప్రజల జీవన ప్రమాణాలు పెంచడానికి ఈ డాక్యుమెంట్ ఎంతో అవసరమన్నారు. జిల్లాలో వివిధ శాఖలలో 100 రోజులలో అభివృద్ధి ప్రణాళికలు మండల స్థాయి వరకు నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే 2024 సంవత్సరం నుండి 2029 సంవత్సరం వరకు మీమీశాఖల అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి ఎస్.జయచంద్ర, వ్యవసాయాధికారి ఎస్.సత్యనారాయణ, సిపిఓ కార్యాలయపు ఎడి కె.ప్రకాష్ రావు, జిఆల్లలోని వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా విజిలెన్స్ ఎంక్వైరీ జరగాలి

- ప్రకాష్‌రెడ్డి చేసిన అక్రమాల నుంచి తప్పించుకోలేడు - రాక్రీట్ సంస్థ కోట్ల రూపాయల దోపిడికి పాల్పడింది - మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత - పేదల సొంతింటి కలను కల్లగా మార్చాడు - ప్రకాష్‌రెడ్డి పై చర్యలతోపాటు సొమ్మును రికవరీ చేయాలి

అనంతపురం, ఆగస్టు 16 ప్రభాతవార్త బ్యూరో

రాక్రీట్ సంస్థ ద్వారా మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి చేసిన అక్రమాలపై విజిలెన్స్ ఎంక్వైరీ నిష్పక్షపాతంగా విచారణ జరగాలని మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి చేశారు. అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో జగనన్న ఇళ్ల నిర్మాణాల్లో ప్రకాష్‌రెడ్డి 2 వందల కోట్ల రూపాయల మేర అ క్రమాలు చేశారన్నారు. రాక్రీట్ సంస్థ ద్వారా 50వేల ఇళ్ల నిర్మాణాలు చేపట్టి ఇసుక, సిమెంట్, ఐరన్ ఇతర వాటిల్లో భారీగా దోచేశారన్నారు. ఒక్క ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే కాకుండా వైఎస్ఆర్ పల్నాడు, గుంటూరు, ఎన్టీఆర్, ఏలూరు, విజయనగరం, విశాఖ జిల్లాల్లోని గృహ నిర్మాణ పనుల్లో అక్రమాలు జరిగాయన్నారు. గతంలోనే 13 వేల ఇళ్ల నిర్మాణాలు రాక్రీట్ సంస్థకు రద్దు చేశారన్నారు. ఇళ్లు నిర్మించకుండానే చాలా వరకు బిల్లులు చెల్లించారన్నారు. ఒక్కొ ఇల్లు బేస్ మెంట్ స్థాయి వరకు నిర్మించాక.. మొదటి విడతగా రూ.60వేలు చెల్లించాలని, కానీ ఆయా జిల్లాల్లో రాక్రీట్ సంస్థకు మాత్రం అధికారులు ప్రత్యేకంగా పరిగణించి, ఇళ్లు పూర్తయినట్లు కాగితాల్లో చూపించి బిల్లులు చేసుకున్నారన్నారు. ఇసుక, సిమెంట్, ఐరన్ పేరుతో పెద్ద ఎత్తున నిధులు దోపిడి జరిగిందన్నారు. కొన్ని చోట్ల ఇళ్లు నిర్మించకుండా బిల్లులు కాజేశారని, అలాగే ఒకే పేరుతో పదుల సంఖ్యలు ఇళ్లు తీసుకున్నారన్నారు. దీనిపై తాము ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు గృహ నిర్మాణశాఖ మంత్రి పార్థసారధికి ఆధారాలతో సహా ఫిర్యాదులు చేశామన్నారు. అందుకే ప్రస్తుతం విజిలెన్స్ ఎంక్వైరీకి ప్రభుత్వం ఆదేశించిందన్నారు. దీనిపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు సునీత తెలిపారు. విజిలెన్స్ అధికారులు రాప్తాడు నియోజకవర్గంలో విచారణ చేపట్టారని, ఇది నిష్పక్షపాతంగా జరగాలని సునీత విజ్ఞప్తి చేశారు. గతంలో ప్రకాష్‌రెడ్డి అక్రమాల మీద హౌసింగ్ అధికారులు ఒక నివేదిక సిద్ధం చేశారని, దానిని బయటకు రాకుండా అధికారం అండతో తొక్కిపెట్టారన్నారు. ఆ నివేదికను కూడా తీసుకుంటే రాక్రీట్ అక్రమాలు బయటకొస్తాయని సునీత అన్నారు. లబ్దిదారుల జాబితా తీసుకుని, వారికి ఇళ్లు దక్కాయా లేదా అన్నదికూడా పరిశీలించాలన్నారు. ప్రభుత్వం ఇళ్లు నిర్మిస్తుందని, పేదలు ఎన్నో కలలు కంటే.. వాటిని కల్లగానే మార్చారన్నారు. ప్రజాసొమ్మును దోచుకున్న ప్రకాష్‌రెడ్డి నుంచి ఆ సొమ్ము రికవరీ చేయాలన్నారు. విజిలెన్స్ అధికారులు ఎలాంటి ఒత్తిళ్లకు లోను కాకుండా విచారణ చేయాలని సునీత అన్నారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత

తుంగభద్ర డ్యామ్ ఆయకట్టు దారులకు శుభవార్త

- తుంగభద్ర డ్యామ్ 19వ నంబర్ చేట్‌కు సంబంధించి మొదటి గేటును విజయవంతంగా దించగలిగాం - రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడి

అనంతపుర ఆగష్టు 16 ప్రభాతవార్త బ్యూరో

తుంగభద్ర ఆయకట్టు దారులకు శుక్రవారం రాత్రి రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుకేశవ్ శుభవార్త వెల్లడించారు. ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న తుంగభద్ర డ్యామ్‌లో 19వ గేటు కొట్టుకుపోయిన తరువాత జరిగినన పరిణామాల నేపథ్యంలో శుక్రవారం రాత్రి మొదటి గేటును విజయవంతంగా దించగలిగాం అని మంత్రి పయ్యావుల కేశవ్ ఒక వీడియోద్వారా ప్రజలకు తెలియజేశారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా అనుకున్నది అనుకున్నట్టుగా తుంగభద్ర డ్యాం 19 వ గేటు కొట్టుకుపోయిన స్థానంలో చాలా విజయవంతంగా గేటు దింపే కార్యక్రమం జరిగిందని ఇప్పుడు అదనంగా మరో నాలుగు అడుగులు నీటిని నిలుపగలుగుతున్నాం అని ఆయన వెల్లడించారు. ఈరోజు రాత్రికి రెండు,మూడు, నాలుగు గేట్లను కూడా దింపే కార్యక్రమం చేపడతాం ఇందుకు భగవంతుడు ఇలాగే సహకారం అందించాలని అన్నారు. భారతదేశ చరిత్రలో పారుతున్న నీటిలో నది నీటి ప్రవాహం ఉన్న తరుణంలో గేటు ఏర్పాటు ఇంజనీరింగ్ సాహసోపేతమైన చర్య అని చెప్పారు. ఈ విషయంలో ఎపి సీఎం చంద్రబాబు నాయుడుకు, కర్ణాటక ప్రభుత్వానికి, టిబి డ్యాం అధికార బృందానికి ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ అయన కృతజ్ఞతలు తెలియజేశారు.

-రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ →

ఘనంగా వరలక్ష్మి వ్రతం పూజలు

డి.హీరేహాళ్, ఆగస్టు 16 ప్రభాతవార్త:

ఆనవాయితీగా శ్రావణమాసంలో నిర్వహించే వరలక్ష్మి వ్రతం పూజలను మహాలక్ష్మమ్మ ఆలయంలో ప్రధాన అర్చకులు రఘుస్వామి ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మి వ్రతం పూజలు జరిపారు. డి.హీరేహాళ్ మండలంలోని ఓబుళాపురం సమీపంలో కొలువుదీరిన నిత్యాన్నదాన ఆశ్రమం మహాలక్ష్మమ్మ ఆలయంలో శుక్రవారం భక్తులు అమ్మవారి వరలక్ష్మి పూజలు చేయించారు. శ్రావణ శుక్రవారంను పురస్కరించుకొని అర్చకులు వేకువ జామునే అమ్మవారి విగ్రహాన్ని శుభ్రపరిచి పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించి సుప్రభాత సేవతో పూజలు ప్రారంభించారు. అనంతరం పుష్పాభిషేకం, కుంకుమార్చన లాంటి ప్రత్యేక పూజలు, మహిళ భక్తులచే అమ్మవారి పారాయణం, సత్సంగం లాంటి సేవలు నిర్వహించి అమ్మవారికి పూజలు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. వరలక్ష్మీ పూజల్లో బళ్లారి జిల్లాలోని బళ్ళారి, హలుకుంది, విఠలాపురం తదితర ప్రాంతాలతో పాటు అనంతపురం జిల్లాలోని రాయదుర్గం, అనంతపురం, కళ్యాణదుర్గం తదితర ప్రాంతాల నుండి భక్తులు తరలివచ్చారు.

యువత స్వయం కృషితో అభివృద్ధి చెందాలి..

డి.హీరేహాళ్, ఆగస్టు 16 ప్రభాతవార్త:

పూజలో పాల్గొన్న వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షులు బండి క్రిష్టప్ప

యువత స్వయంకృషితో అభివృద్ధికి బాటలు వేసుకోవాలిసిన అవసరం ఎంతైనా ఉందని రాయదుర్గం నియోజకవర్గం వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షులు నాయకుల బండి క్రిష్టప్ప పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన రాయదుర్గం పట్టణంలోని కొలిమి వీధిలో డాక్యుమెంట్ వర్క్ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని పూజలు అనంతరం ఆయన మాట్లాడారు. దస్తావేదులేఖరి బోయపాటి ప్రకాష్ ఆహ్వానం మేరకు కార్యాలయం ప్రారంభోత్సవకార్యక్రమంలోపాల్గొన్న ఆయన యువత తమ జీవనోపాధి కోసం ప్రభుత్వంపై ఆధారపడకుండా స్వయంకృషితో ఎదుగుతూ పదిమందికి సేవలందించే స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. రైతులు, ఆయావర్గాల ప్రజలు భూములు, ఇళ్లు, స్థలాలులాంటి క్రయ, విక్రయాలపై వచ్చే వారికి న్యాయబద్ధమైన సేవలు అందించాలని, ఆ దస్తాలేఖరికి ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ సేవా సమితి సభ్యులు అజయ్‌టైలర్ రఘు, మీడియా సలహాదారులు తలారి మల్లయ్య, తాళ్లకెర వాల్మీకి రావన్న, మిత్రుడు విశ్రాంతి ఉద్యోగి గొల్ల గోపాల్ పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని ఓ నిరుపేద కుటుంబానికి నిత్యావసర సరుకులు పంపిణీ..

గుమ్మఘట్ట, ఆగస్టు 16 ప్రభాతవార్త:

నిత్యావసర సరుకులు అందిస్తున్న ఛేంజ్ ఫర్ సొసైటి సభ్యులు

మండల పరిధిలోని గోనబావి గ్రామానికి చెందిన ఓ కుటుంబం దీన స్థితిని వివరిస్తూ తమ మహోన్నత మానవత్వంతో గోనబావి గ్రామ పాస్టర్ పి.జాన్ పాల్(మాంతేష్) పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ఛేంజ్ ఫర్ సొసైటిని అభ్యర్థిం చారు. ఆ అభ్యర్థనలో ఆ కుటుంబానికి చెందిన మటం వన్నురమ్మకు చెందిన కుమార్తె సరోజమ్మ, మనవడు ఓబలేషు మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్నారని, వారి కనీస అవసరాలకు కూడా ఇబ్బంది పడుతూ సరైన ఆహారం లేదని, ఓ నెల సరుకులకైనా సాయం అందించాలని కోరారు. స్పందించిన ఛేంజ్ ఫర్ సొసైటి టీం సభ్యులు దాతల సహకారంతో సుమారు రూ.8వేల పైచిలుకు నిత్యావసర సరుకులు, బియ్యం, కూరగాయలను ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు గుమ్మఘట్ట పిడి. వన్నూరప్ప, ఐదు మండలాల అధ్యక్షులు జెసిఎం పాస్టర్ సల్మన్ అంపన్న, స్టీల్ ప్లాంట్ సాధన కమిటి అధ్యక్షులు బియం.నాదల్, ఫాస్టర్ పి.జాన్‌పాల్ చేతుల మీదుగా అందిజేశారు. దీంతో పాటు ఆ కుటుంబ సభ్యులు అంగీకరిస్తే ఆ మతి స్థిమితం లేని ఇద్దరిని పూర్తి బాధ్యతగా మానసిక దివ్యంగుల ఆశ్రమంలో చేయవేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఛేంజ్ ఫర్ సొసైటి టీం కేపిదొడ్డి మంజునాథ్, రోజా, అనిత మరియు కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు మారెప్ప, పైంటి తిప్పేసాన్వమి, సీన, చిదానంద, సుందర్ రాజు, ఆనంద తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో గడప గడపలో వరలక్ష్మి వ్రతం

రాయదుర్గం, ఆగస్టు 16 ప్రభాతవార్త:

పట్టణంలో శుక్రవారం వరలక్ష్మి వ్రత సందర్భంగా గడప గడపలో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్టించి వరలక్ష్మి వ్రతాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఓబుళాచారీ రోడ్డులో మహాలక్ష్మి ఆలయంలో మరియు వివిధ ఆలయాల్లో ఉన్న అమ్మవార్లకు ఉదయాన్నే సుప్రభాతసేవ, గంగాబిషేకం, పంచామృతాబిషేకం, వస్త్రఅలంకరణ, పుష్పఅలంకరణ, కుంకుమార్చన, మహా మంగళహారతి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయాల్లో మహిళా భక్తులచే వరలక్ష్మి వ్రతంను నిర్వహించారు. అలాగే పట్టణంలోని కోటలో ప్రాంతంలోని కుమ్మరి వీధిలో ఉన్న రేణుఖ ప్రకాష్ దంపతులు తమ స్వగృహంలో అమ్మవారి ప్రతిమను మామిడి తోరణాలు, అరిటాకులు, పుష్పాలతో సర్వసుందరంగా అలంకరించి అమ్మవారి వ్రతంను ఆచరించి ముత్తైదువులకు తాంబులాలు అందించి వారి ఆశీర్వాదలు తీసుకున్నారు. అలాగే తమ స్వగృహంలో మిత్రులకు అన్నసంతర్పణ గావించారు. అనంతరం సాయంకాలం మహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలోఉన్న అమ్మవార్లను పట్టణంలో ఊరేగింపు చేపట్టారు.

మిత్రుని భార్యకు సహాయం అందించిన మిత్రులు

బెలుగుప్ప, ఆగస్టు 16 ప్రభాతవార్త

మిత్రుని భార్యకు నిత్యావసర సరుకులు, ఆర్థిక సాయం చేస్తున్న దృశ్యం

మండల కేంద్రంలో బిసి కాలనీకి చెందిన బి.అంజి రెండు నెలల క్రితం మృతి చెందడంతో 2004-2005 సంవత్సరానికి చెందిన 10వ తరగతి విద్యార్థులు మిత్రులు శుక్రవారం అతని భార్యకు ఆర్థికంగా లక్ష 1000 రూపాయలు, రూ.5వేల నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా మిత్రులు మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో కూడా మీకు సహాయ సహకారాలు అందిస్తామని అతనికుటుంబానికి అండగా ఉంటామని తెలియజేశారు.

శుభకార్యాలయాలకు హాజరైన అనంతపురం మాజీ పార్లమెంట్ సభ్యులు



నూతన వధువరులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న మాజీ ఎంపి రంగయ్య

శెట్టూరు, ఆగస్టు 16 ప్రభాతవార్త

శెట్టూరు మండల కేంద్రంలో మాజీ సర్పంచు బొమ్మజ్జి రమేష్ నూతన గృహ ప్రవేశం ముచ్చర్లపల్లి గ్రామంలో విద్యార్థి విభాగం నాయకుడు నవీన్ కుమార్ వివాహ రిసెప్షన్ అయ్యగార్లపల్లి గ్రామంలో జడ్పిటిసి మంజునాథ నిర్వహించిన వరలక్ష్మి వ్రతం పజా కార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, జడ్పిటిసి మంజునాథ్, ఎంపిపి సోమనాథ్‌రెడ్డి, ఎమ్మెస్‌ను హనుమంతరాయుడు బోయ తిప్పేస్వామి, సర్పంచులు ఈరన్న, సత్యనారాయణరెడ్డి, పోస్ట్ రామకృష్ణ బేరిల రాజు బిక్కి హరి పాత లింగ జానీ వైఎస్ఆర్‌సిపి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని సచివాలయ సిబ్బంది

శెట్టూరు, ఆగస్టు 16 ప్రభాతవార్త

సమయం 11 గంటలైనా తెరుచుకోని సచివాలయం తలుపులు

మండలంలోని యాటకల్లు గ్రామ సచివాలయ సిబ్బంది శుక్రవారం ఉదయం 11:00 గంటలైనా ఏ ఒక్కరు విధులకు హాజరు కాలేదు కనీసం గ్రామ సచివాలయ తాళం కూడా తీయకపోవడంతో ప్రజలు ఆశ్చర్యపోయారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధిలా ఉండే సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించక పోవడం ఇదేమీ కొత్త కాదు. మండల వ్యాప్తంగా చాలా సచివాలయాలు సమయపాలన పాటించడం లేదని మండల ప్రజలు చెబుతున్నారు. మండల అధికారులు సిబ్బంది పోయిన తగు చర్యలు తీసుకోకపోవడంతో ఇలాంటి పరిస్థితులు పునరావృతం అవుతున్నాయి. ఇప్పటికైనా మండల అధికారులు సిబ్బంది పైన చర్యలు తసీఉకుని సక్రమంగా ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా అధికారులని చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆర్థిక శాఖ మంత్రి చేతులు మీదుగా అవార్డు అందుకున్న హెడ్‌కానిస్టేబుల్

బెలుగుప్ప, ఆగస్టు 16 ప్రభాతవార్త

ఆర్థిక శాఖ మంత్రి చేతులు మీదుగా అవార్డు అందుకుంటున్న హెడ్‌కానిస్టేబుల్

మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మల్లికార్జునకు 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, కలెక్టర్ వినోద్ కుమార్ చేతులు మీదుగా ఉత్తమ సేవా అవార్డు తీసుకున్నారు. బెలుగుప్ప పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న మల్లికార్జునకు ఆయన చేసిన సేవలకుగాను అవార్డు రావడం వల్ల ఎస్ఐ శివ, పోలీసు సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా వరలక్ష్మి వ్రతం

బెలుగుప్ప, ఆగస్టు 16 ప్రభాతవార్త

మండల పరిధిలో బూదిగుమ్మ వెంకట రమణస్వామి దేవాలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో వరలక్ష్మి వ్రతంను గ్రామానికి చెందిన మహిళలు ప్రత్యేకంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. వచ్చిన వారికి తీర్థప్రసాదాలు అందించారు. శ్రావణమాసంలో ఈ వ్రతం చేయడం వల్ల మహిళలకు మేలు జరుగుతుందని వారికి తెలిపారు. అందులో భాగంగా బెలుగుప్ప తాండాలో కూడా కొల్లాపురం మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తాదులు పాల్గొన్నారు.

దళిత గిరిజన భూ సమస్యలు పరిష్కరించాలి

- ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి

కంబదూరు, ఆగస్టు 16 ప్రభాతవార్త

దళిత గిరిజన భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి పేర్కొన్నారు. కంబదూరు మండల తహశీల్దారు బాల కిషన్‌ను భూ బాధితులతో కలిసి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. ఈ సందర్భంగా సాకే హరి మాట్లాడుతూ..మండల పరిధిలోని ఎస్సీ, ఎస్టీలకు చెందిన వివిధ రకాల భూ సమస్యలను పరిష్కరించి న్యాయం చేయానలి పలు దఫాలుగా కార్యాలయాలు, అధికారులు చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగి ప్రయోజనం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసి దోన తిమ్మప్ప, జక్కిరెడ్డిపల్లి నరసింహులు, చెన్నేపల్లి ప్రతాప్, వెంకటేష్, ప్రకాష్, ఓబులేసు, గోపాల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు సంఖ్య పెంచండి... డిపిఎంఓ రవిశంకర్

గుమ్మఘట్ట, ఆగస్టు 16 ప్రభాతవార్త:

తనిఖీ చేస్తున్న డిపిఎంఓ రవిశంకర్...

ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు సంఖ్య పెంచాలని డిపిఎంఓ ఎన్‌హెచ్ ఎం రవిశంకర్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గుమ్మఘట్ట ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రోగులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా నాణ్యమైన వైద్యం అందించేందుకు కృషి చేయాలని సిబ్బందిని కోరారు. సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్ తదితర రిజిస్టర్లను తనిఖీ చేసి ప్రతి ఒక్కరూ తమ విధులకు తప్పకుండా హాజరుకావాలని సిబ్బందికి ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు సంఖ్య పెంచాలని డిపిఎంఓ ఎన్‌హెచ్ఎం రవి శంకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్, డాక్టర్ సందేశ్, డాక్టర్ బాలాజీ నాయక్, సిహెచ్ఓ మురళి ధర్, సూపర్ వైజర్లు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

హిందూపురం జిల్లా కేంద్రం కోసం కృషి

-ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

హిందూపురం, ఆగస్టు 16 ప్రభాతవార్త

హిందూపురం జిల్లా కేంద్రంగా చేయాలని ఇప్పటికే ప్రభుత్వాన్ని కోరినట్లు స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ స్పష్టం చేశారు. శుక్రవారం మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు స్పందించిన ఆయన జిల్లా పేరును శ్రీసత్యసాయిగానే కొనసాగిస్తూ జిల్లా కేంద్రంగా హిందూపురాన్ని చేయాలని భావిస్తున్నామన్నారు. అయితే ప్రభుత్వం దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకున్న సిద్ధమే అని ఆయన అన్నారు.

చైర్‌పర్సన్ పదవికి ఇంద్రజ రాజీనామా

హిందూపురం, ఆగస్టు 16 ప్రభాతవార్త

వైసిపి నుండి గెలుపొంది తెలుగుదేశం పార్టీలో చేరిన స్థానిక మున్సిపల్‌చైర్‌పర్సన్ ఇంద్రజ తన పదవికి రాజీనామా చేశారు. గురువారం ఆమె ఎమ్మెల్యే బాలకృష్ణ సమక్షంలో ఆ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. ముందుగా చేసుకున్న ఒప్పందంలో భాగంగా ఆమె తన పదవికి రాజీమానా చేసినట్లు తెలిసింది. దీంతో మున్సిపల్ పీఠం త్వరలో టిడిపి పరం కానుంది. రాజీనామా అంశంపై మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ప్రత్యేకంగా ఏర్పాటు చేసి ఆమోదించిన తరువాత మున్సిపల్ డిఎంఏకు సమాచారం అందించనున్నట్లు కమీషనర్ శ్రీకాంత్‌రెడ్డి ప్రభాతవార్తకు తెలిపారు. ఆ తరువాత డిఎంఏ నూతన మున్సిపల్‌చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. కాగా ఈ పదవికి ఇప్పటికే సీనియర్ నేత డిఇ రమేష్‌కుమార్ ఖరారైన విషయం తెలిసిందే.

పార్టీ ఫిరాయించిన వారిపై బహిష్కరణ - వైసిపి

హిందూపురం, ఆగస్టు 16 ప్రభాతవార్త

వైసిపికి చెందిన మున్సిపల్‌చైర్‌పర్సన్ ఇంద్రజతో పాటు కౌన్సిలర్లు తెలుగుదేశం పార్టీలో చేరడంతో వారందరినీ వైసిపి నుండి బహిష్కరిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు నవీన్ ఒక ప్రకటన విడుదల చేశారు. పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ దీపిక ఫిర్యాదుతో ఈ చర్య తీసుకున్నట్లు అందులో పేర్కొన్నారు. కాగా వైసిపి నుండి బహిష్కరణకు గురైన కౌన్సిలర్లలో ఇంద్రజ, నాసిరభాను, గిరీష్‌కుమార్, రహమత్, బి.మల్లికార్జున, సునీతరెడ్డి, మణి, పరశురాం, ఆయూబ్, నాగేంద్రమ్మ, రేష్మభాను, నాయకులు వెంకటేష్‌రెడ్డి, షఫీ, కిరోసిన్ బాబు వున్నారు.

వైభవంగా వరలక్ష్మీవ్రతం

హిందూపురం టౌన్, ఆగస్టు 16 ప్రభాతవార్త

ప్రత్యేక అలంకరణలో అష్టలక్ష్మీ, కొల్హాపుర అమ్మవారు

పట్టణంలోని లేపాక్షి రోడ్డులో వెలసిన శ్రీఅష్టలక్ష్మీ ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా పట్టణంలోని కొల్హాపుర అమ్మవారి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. అదేవిధంగా పట్టణంలో గృహిణిలు ఇళ్లల్లో వరలక్ష్మీవ్రతం పూజలను ప్రత్యేకంగా నిర్వహించారు.

విద్యుత్‌శాఖ ఏఇకి ఘనసన్మానం



ట్రాన్స్‌కో ఏఇని సన్మానించిన దృశ్యం

లేపాక్షి, ఆగస్టు 16 ప్రభాతవార్త

ఏపిఎస్‌పిడిసిఎల్ పరిధిలో లేపాక్షి విద్యుత్ సబ్‌స్టేషన్ ఉత్తమ సబ్‌స్టేషన్‌గా ఎంపికై ఆగస్టు 15వతేదీన తిరుపతిలో లేపాక్షి విద్యుత్‌శాఖ ఏఇ వెంకటేశ్వర్లు ఉత్తమ సబ్‌స్టేషన్ అవార్డును స్వీకరించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో శుక్రవారం మండల కేంద్రమైన లేపాక్షిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ విద్యుత్ శాఖ ఏఇ వెంకటేశ్వర్లతో పాటు లైన్‌ఇన్‌స్పెక్టర్ సుదర్శన్‌లను విద్యుత్‌శాఖ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏఇ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ లేపాక్షి సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది సహకారంతోనే లేపాక్షి సబ్‌స్టేషన్ ఉత్తమ సబ్‌స్టేషన్‌గా ఎంపికైందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. తమకు సహకరించిన సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో లైన్‌మెన్ హర్షద్, ప్రభాకర్, హరి, విద్యుత్‌శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపై ధ్యాసను పెంచుకోవాలి

వేరే వ్యసనాలకు దూరంగా ఉండండి... ఎమ్మెల్యే కాలవ

ఫ్రెసర్స్‌డే కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ...

రాయదుర్గం, ఆగస్టు 16 ప్రభాతవార్త:

విద్యార్థులు చదువుపై ధ్యాస తప్ప వేరే వ్యసనాలకు తావివ్వవకుండా విద్యను అభ్యశించాలని స్థానిక ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విద్యార్థులకు సూచించారు. శుక్రవారం పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫ్రెసర్స్‌డే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో రాణించాలన్నా, చెడిపోవాలన్న విద్యార్థులకు ఇంటర్మీడియట్ చాలా కీలకమైన దశ అని పేర్కొన్నారు. రోజు రోజుకు విద్యను సాకేతికంగా ఆవిష్కరణ చేస్తున్నామన్నారు. భవిష్యత్తులో ఏ రంగాల్లో అవకాశాలు ఉంటాయో ఆ రంగాల్లో విద్యార్థులు రాణించాలన్నారు. మంచి పుస్తకాలను చదివి సమాజంపై, సమాజంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. నిర్దిష్టమైన కార్యాచరణతో జీవిత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. సోమరి తనాన్ని వీడి నిరంతరం కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. సెల్‌ఫోన్లను విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకే వాడాలన్నారు. కేంద్ర లో నరేంద్రమోడి, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రోజుకు 16గంటల పాలు పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్లు డి.విజయభాస్కర్, కె.వీరేష, ఎం. రాజుగోపాల్, ఆంజినేయులు, రిటైర్డ్ ఇంగ్లీష్ లెక్చరర్ అయూబ్‌ఖాన్, తెదేపా పట్టణాద్యక్షుడు పసుపులేటి రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందిండి

-ప్రభుత్వాసుపత్రిని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

ఆసుపత్రిలో పర్యటిస్తున్న జిల్లా కలెక్టర్ చేతన్

హిందూపురం టౌన్, ఆగస్టు 16 ప్రభాతవార్త

ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా కలెక్టర్ చేతన్ వైద్యులకు సూచించారు. శుక్రవారం హిందూపురం పర్యటనలో భాగంగా ఆయన జిల్లా ప్రభుత్వాసుపత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు కంప్యూటర్ ఒపి స్లిప్పులు అందచేయాలని ఆదేశించారు. ప్రభుత్వాసుపత్రిలో పరిసరాలు పరిశుభ్రంగా వుంచుకోవాలని తెలిపారు. ప్రస్తుతం వర్షాకాల పరిస్థితులను దృష్టిలో వుంచుకొని ప్రజలకు అందుబాటులో వుండి వైద్య సిబ్బంది నిరంతరం వైద్యసేవలు అందించాలన్నారు. ప్రధాన ఆసుపత్రిలో సాంకేతిక పరికరాలు, మందులను అందుబాటులో వుంచుకోవాలని సూచించారు. పార్కింగ్ ప్రాంగణాన్ని ఆసుపత్రి మొత్తం తిరిగి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ సబ్‌కలెక్టర్ అపూర్వభరత్, ఆసుపత్రి ఆర్ఎంఒ డాక్టర్ డేవిడ్‌రాజు, నర్సింగ్ సూపరింటెండెంట్ ఓబులమ్మ, వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు ప్రజలు సహకరించాలి...సీఐ

బాధ్యతలు చేపట్టిన రూరల్ సీఐ వెంకటరమణ

రాయదుర్గం, ఆగస్టు 16 ప్రభాతవార్త:

శాంతి భద్రతల పట్ల ప్రజలు సహకరించాలని రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్లో ఆయన రాయదుర్గం రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రొద్దుటూరు 3టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ఉన్నతాధికారుల రాయదుర్గం స్టేషన్‌కు బదిలీ చేయడంతో ఇక్కడికి రావడం జరిగిందన్నారు. తమ సర్కిల్ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. రూరల్ పరిధిలో మట్కా, పేకాట, జూదం, గుట్కా, కర్ణాటక మద్యం తదితర వాటిపై ఉక్కుపాదం మోపుతామన్నారు.

కోట్ల మరణ మృతి, పార్టీకి తీరనిలోటు

- వర్ధంతి కార్యక్రమంలో మాట్లాడిన పరిటాల శ్రీరామ్

రాతిదూళ లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న పరిటాల శ్రీరామ్ దృశ్యాలు

ధర్మవరం రూరల్, ఆగస్టు 16 ప్రభాతవార్త

నియోజకవర్గం ముదిగుబ్బ మండలంలో కోట్ల రమణ మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. రమణ మొదటి వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు కోట్ల మనోజ్ రాతి ధూలం లాగుడు పోటీల నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరిటాల శ్రీరామ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కోట్ల రమణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిం చారు. అనంతరం రాతిదూళం లాగుడు పోటీలను ప్రారంభించి కాసేపు పోటీలను శ్రీరామ్ ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడు తూ.. కోట్ల రమణ ఆశయాన్ని మనోజ్ ముందుకు తీసుకెళ్తారని, ఆ కుటుంబ సేవలు పార్టీకి ఎంతో అవసరం అన్నారు. తండ్రి వర్ధంతి సందర్భంగా సాంప్రదాయంగా వస్తున్న రాతి దూలం లాగుడు పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నా రు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులతో పాటు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. రాతి దూలం లాగుడు పోటీలను చూసేందుకు జనం భారీగా తరలివచ్చారు.

03ATP16_03ATP16.qxd 16-08-2024 PM 11:23 Page 1

డిడి కుష్బూ కొఠారి పై కలెక్టర్ ఆగ్రహం

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 16 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా బిసి సంక్షేమశాఖ, సాంఘీక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూ కొఠారిపై శుక్రవారం జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మిగిలిన సిసి కెమెరాలను జిల్లాలోని ఎస్సీ, బిసి హాస్టల్స్‌లో లోపలికి వచ్చేటప్పుడు, వెళ్లేటప్పుడు అందరూ కనిపించేలా ఒక్కొక్క సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని దాదాపు నెల రోజుల క్రితం డిడి కుష్బూ కొఠారిని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మొదట మున్సిపల్ కమిషనర్లకు లెటర్ పంపించినట్లు తెలిసింది. అయితే అక్కడి నుంచి ఇలాంటి సమాధానం రాలేదని తెలిసింది. ఆ తర్వాత కొన్ని రోజులకు డిఆర్‌ఓ, ఆర్డిఓలకు లెటర్ పంపించగా నేటికీ సమాధానం రాలేదని తెలిసింది. అయితే శుక్రవారం జిల్లా కలెక్టర్ నిర్వహించిన సమావేశంలో సిసి కెమెరాలు ఏర్పాటుచేశారో లేదా అని కలెక్టర్ డిడిని ప్రశ్నించగా, లేదు అని నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని గత సమావేశంలో ఆదేశాలు ఇచ్చినప్పటికీ, ఇంత వరకు ఎందుకు ఏర్పాటు చేయలేదని, ఏదైనా సమస్య ఉంటే నా దృష్టికి వెంటనే తీసుకురావాలని, నేను అడిగే వరకు ఎందుకు చెప్పలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిసి కెమెరాలు ఏర్పాటుకు సంబంధించిన వివరాలు వెంటనే తనకు అందజేయాలని ఆదేశించినట్లు సమాచారం.

జీఓ నెంబర్ 117 రద్దు ఆర్థిక మంత్రికి ఎపిటిఎఫ్ ప్రాతినిధ్యం

మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 16 ప్రభాతవార్త

ఏపిటిఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు జీవో నెంబర్ 117ని రద్దు చేయాలని ప్రధాన డిమాండ్‌తో రాష్ట్ర వ్యాప్తంగా శాసనసభ్యులకు ప్రాతినిధ్యం చేయాలని పిలుపుతో ఏపిటిఎఫ్ అనంతపురం జిల్లా శాఖ ఆ ధ్వర్యంలో రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి.నరసింహులు రాష్ట్ర పూర్వ అధ్యక్షులు ఎం.రఘురాం రెడ్డి, జిల్లా అధ్యక్షులు రాయల్ వెంకటేష్ జిల్లాప్రధాన కార్యదర్శి ఎస్.సిరాజుద్దీన్, జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి బి.హనుమప్ప జిల్లా ఉపాధ్యక్షులు సాకే భాస్కర్ సతీష్‌కుమార్ ఓబులేసు ఆడిట్ కమిటీ కన్వీనర్ వన్నప్ప రాష్ట్ర కౌన్సిలర్ రమణ జిల్లా నాయకులు రామకృష్ణ సూర్యనారాయణ అడవిరాజు తిప్పేస్వామి ఓబిలేసు క ఇషోర్ తదితరుల పాల్గొని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కి అనంతపురంలో మెమోరాండం సమర్పిస్తూ విద్యా, ఉపాధ్యాయ రంగ సమస్యలను ముఖ్యంగా జీవో 117 రద్దు సమాంతర తెలుగు ఆంగ్ల బోధన మాధ్యమాల కొనసాగింపు పనపి విభజనకు ముందే ప్రమోషన్ల కార్యక్రమం చేపట్టాలని చర్చించి ప్రాతినిధ్యం చేశారు.

విద్యుత్ కోతల సమస్యను పరిష్కరించండి

లైన్‌మెన్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

శింగనమల, ఆగస్టు 16 ప్రభాతవార్త

మండల వ్యాప్తంగా గత కొద్దిరోజులుగా ఏర్పడుతున్న విద్యుత్ కోతల సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం మండల కేంద్రంలోని సబ్ స్టేషన్‌లో లైన్‌మెన్‌కు శింగనమల గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత కొద్దిరోజులుగా వేలా పాలా లేకుండా విద్యుత్ కోతలు అమలు చేస్తుండటంతో రైతులకు విద్యార్థులకు, ప్రభుత్వ కార్యాలయాలకు, వ్యాపారస్తులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని అన్నారు. గతంలో బుక్కరాయ సముద్రం సబ్ స్టేషన్ నుంచి శింగనమల సబ్ స్టేషన్‌కు, సలకం చెరువు సబ్ స్టేషన్‌కు, పెరవలి సబ్ స్టేషన్‌కు విద్యుత్ సప్లై చేసే వారని, తరిమెల సబ్ స్టేషన్‌ను కల్లూరు నుంచి విద్యుత్ సప్లై అవుతూ ఉండేదన్నారు. ఎమర్జెన్సీ సమయంలో కానీ, మరమ్మత్తుల సమయంలో కానీ తరిమెలకు విద్యుత్ సరఫరా చేసే వారని, ఇప్పుడు బుక్కరాయ సముద్రం నుంచి తరిమెలకు విద్యుత్ సరఫరా జరుగుతోందని, అందువల్ల లోడ్ ఎక్కువై లేక తక్కువై విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందన్నారు. కావున విద్యుత్ అధికారులు స్పందించి పాత పద్ధతిలోనే విద్యుత్ సరఫరా చేయాలని వారు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు సి.వెంకటేష్, శంకర్‌నారాయణ, బండి వెంకట నారాయణ, విజయ్, నారాయణస్వామి, పెద్దన్న, రాముడు, నాగరాజు, ఓబుళపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సరైన సౌకర్యాలు కల్పించండి
- తహశీల్దారు బ్రహ్మయ్య

విద్యార్థులతో మాట్లాడుతున్న తహశీల్దారు బ్రహ్మయ్య

శింగనమల, ఆగస్టు 16 ప్రభాతవార్త

విద్యార్థులకు సరైన సౌకర్యాలు కల్పించాలని తహశీల్దారు సాకే బ్రహ్మయ్య బిసి హాస్టల్ వార్డెన్ మస్తాన్‌ను ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని బిసి బాలుర వసతి గృహాన్ని తహశీల్దారు సాకే బ్రహ్మయ్య ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ.. నాణ్యమైన భోజనం అందిస్తున్నారా, విద్యార్థులకు తాగునీరు పుష్కలంగా సరఫరా అవుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే విద్యార్థులు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రభుత్వం సూచించిన మెనూ ను కచ్చితంగా అమలు చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన తోపాటు హనుమాన్ ప్రసాద్, విఆర్‌ఓ తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

సచివాలయ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం.

అనంతపురం రూరల్,
ఆగస్టు 16 ప్రభాతవార్త:

అనంత రూరల్ మండలం రాచానపల్లి, అక్కంపల్లి, కొడిమి, ఎస్ఎన్‌కుంట, తాటిచెర్ల, సోమలదొడ్డి,రాజీవ్‌కాలనీ, నారాయణపురం, రూరల్, పూలకుంట, చియ్యేడు, ఆకు తోటపల్లి, కందుకూరు, ఉప్పరపల్లి పంచాయితీల్లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరిగిందని సర్పంచులు అంజినేయులు యాదవ్,మల్లెల పుష్పవతి లింగమయ్య, సావిత్రి శ్రీనివాసులు, సుబ్బిరెడ్డి,అమర్‌నాథ్‌రెడ్డి,కృష్టారెడ్డి, గంగాధర్‌రెడ్డి,గురుప్రసాద్,ప్రశాంత్‌కుమార్,ఆశాబీ,ఉదయశంకర్,కార్యదర్శులు ముత్యాలరెడ్డి,అశోక్‌బాబు,మహేశ్వరరెడ్డి,ప్రేమ్‌కుమార్,మహమ్మద్ రఫి, నరసింహారెడ్డి,పేర్కొన్నారు. గురువారం అనంత రూరల్ మండలంలోని పలు గ్రామ సచివాలయ కార్యాలయంలో సర్పంచుల ఆధ్వర్యంలో కార్యదర్శులు ముత్యాలరెడ్డి,అశోక్‌బాబు, మహేశ్వరరెడ్డి,ప్రేమ్‌కుమార్, మహమ్మద్ రఫి,నరసింహారెడ్డిలు 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంత రూరల్‌లో స్వాతంత్ర్య సమరయోధులను, సైనికులను, పారిశుధ్య కార్మికులను,అదే విధంగా ఉప్పరపల్లి,కందుకూరు పంచాయితీలలో కార్మికులను శాలువలతో ఘనంగా సన్మానించారు.పాఠశాల విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు,మండల కన్వీనర్లు,ఉప సర్పచులు,వార్డుసభ్యులు,టిడిపి,జనసేన,సిపిఐ నాయకులు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సీత, రామ, సమేత, లక్ష్మణ, హనుమాన్ స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ట
- పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పరిటాల సునీత

సీత, రామ, సమేత లక్ష్మణ హనుమాన్ స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ట దృశ్యాలు

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 16 ప్రభాతవార్త

చెన్నేకొత్తపల్లి మండల పరిధిలోని, చిన్నపల్లి గ్రామంలో శ్రీ సీతాలక్ష్మణ హనుమత్ సమేత రామచంద్రస్వామివారి నూతన విగ్రహ ప్రతిష్ట, వేద పండితులచే అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ ప్రతిష్ట కార్యక్రమానికి రాప్తాడు నియోజకవర్గ శాసనసభ్యురాలు పరిటాల సునీత పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో హిందూపురం పార్లమెంట్ ఉపాధ్యక్షులు దండు ఓబులేసు, మా మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్‌క్రీడాకారుడు ద్వారకానాథ్‌రెడ్డిని అభినందించిన మంత్రి పయ్యావులకేశవ్
- స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రశంస పత్రం అందజేత

మంత్రి చేతులు మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న ద్వారకానాథ్‌రెడ్డి

అనంతపురం కల్చరల్, ఆగస్టు 16 ప్రభాతవార్త

భారత్ బాస్కెట్ బాల్ జట్టు క్రీడాకారుడు ద్వారకానాథ్‌రెడ్డి అనంత ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయి లో ఇనుమడింప చేయడం అభినందనీయమని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. గురువారం భార త 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ద్వారకానా థ్‌రెడ్డికి ప్రశంసా పత్రం అందజే శారు. జాతీయ స్థాయిలో రాణించి అనంత కీర్తి పతాకాన్ని అంతర్జాతీయ స్థాయిలో రెపరెప లాడించారని కేశవ్ సూచించారు.

ఆ తల్లి అనుగ్రహం ప్రజలపై అన్ని వేళలా ఉండాలి
- ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

వరలక్ష్మి వ్రతంలో ఎమ్మెల్యే

శింగనమల, ఆగస్టు 16 ప్రభాతవార్త

ఆ వరలక్ష్మి తల్లి అనుగ్రహం అన్ని వేళలా ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. రెండవ శ్రావణ శుక్రవారం వరలక్ష్మి వ్రతంను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తన కుటుంబ సభ్యులతో కలిసి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. పూజ అనంతరం ఆమె మాట్లాడుతూ.. శ్రీ లక్ష్మిదేవి దివ్య ఆశీస్సులతో సిరి సంపదలతో సుఖ సంతోషాలతో ప్రజలు జీవించాలని కోరు కుంటూ ప్రజలందరికీ శ్రావణ శుక్రవారం వర లక్ష్మి వ్రతం శుభాకాంక్షలు తెలిపారు. ఈ పూజా కార్యక్రమంలో బండారు రవికుమార్, బండారు లీలావతిలు పాల్గొన్నారు.

78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎస్ఎస్ఎస్ మోక్షిత్ స్కూల్‌లో ఘనంగా ర్యాలీ

ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్,
ఆగస్టు 16 ప్రభాతవార్త

78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎస్ఎస్ఎస్ మోక్షిత్ స్కూల్‌లో ఘనంగా ర్యాలీ నిర్వహిం చారు. ఈ ర్యాలీ స్కూల్ స్టార్ట్ చేసి ఆర్‌డిటి ఆఫీస్ నుంచి, నేతాజీ, నగర్, శారద నగర్ వరకు నిర్వహించారు. ఇందుకు స్కూల్ స్టూడెంట్స్, పేరెంట్స్ పెద్ద ఎత్తున రావడం జరిగింది. ర్యాలీ ముగిసిన తర్వాత స్కూల్‌లో ఫ్లాగ్ హోస్టింగ్ కరస్పాండెంట్ సుబ్బారెడ్డి నిర్వహించారు. అనంతరం లక్కి ప్రైజెస్ డిస్ట్రిబ్యూషన్ చేయడం జరిగింది. మోక్షిత్‌రెడ్డి సమర యోధుల గురించి స్పీచ్ ఇవ్వడం జరిగింది. ప్రోగ్రాం ముగిసిన అనంతరం విద్యార్థులకు, తల్లి తండ్రులకు, బిస్కట్స్, స్వీట్స్ ఉపాధ్యాయులు ఇవ్వడం జరిగింది.

ఎస్ఐ ఈశ్వరయ్యకు శుభాకాంక్షలు తెలిపిన ఎంఆర్‌పిఎస్ నాయకులు

ఎస్ఐ ఈశ్వరయ్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు.

అనంతపురం రూరల్,
ఆగస్టు 16 ప్రభాతవార్త:

అనంత రూరల్ మండల ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన ఈశ్వరయ్యను ఎంఆర్‌పిఎస్ రాయలసీమ జిల్లాల అధ్యక్షులు యు.రమణ ఆధ్వర్యంలో కురుకుంట టిడిపి నాయకులు నారాయణస్వామి, ఎంఆర్‌పిఎస్ నాయకులు చిన్న పెద్దన్న, రాజేష్, ఓబిలేసు, మురళి, రామాంజి, చిన్నోబిలేసు, రామకృష్ణ,సత్యమయ్య,కుంటన్న ఓబిలేసు,నాగరాజు, మల్లికార్జున,హరిలు శుక్రవారం ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలసి ఆయనకు పుష్పగుచ్చాం అందజేసి శాలువతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఐదేళ్లుగా ఆగిపోయిన హంద్రీనీవా కాలువ పనులు తిరిగి చేపట్టేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నాం..
-రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

అనంతపురం, ఆగస్టు 16 ప్రభాతవార్త బ్యూరో

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో కొత్తగా ఏర్పడిన తమ ప్రభుత్వం గత ఐదేళ్లుగా ఆగిపోయిన హంద్రీనీవా కాలువ పనులు తిరిగి చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించడంజరుగుతోందని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. శుక్రవారం అనంతపురం నగరంఓలని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో హంద్రీనీవా కాలువ పనులపై హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తొలిదశలో జిల్లాలో ఉరవకొండ వరకు ఉన్న మెయిన్ కెనాల్‌ను విస్తరించడం, దానితర్వాత హోతూరు,చాబాలా కెనాల్‌ను పునరుద్ధరించడం, అనంతరం కింద ఉన్నటువంటి చీకుదుర్తి, లత్తవరం కెనాల్, వ్యాసాపురం, రేణుమాకులపల్లి వరకు ప్రతి కెనాల్‌ని పునరుద్ధరించుకుంటూ రావడం చేపడుతామన్నారు. జిల్లాలోని జీడిపల్లి వరకు కూడా 3,850 క్యూసెక్కుల వరకు నీటిని తీసుకెళ్లే సామర్థ్యాన్ని పెంచేలా, ఆగిపోయిన కెనాల్ వెడల్పు చేసి కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసేందుకు ప్రాథమిక ప్రణాళికలు రూపొందించుకుంటున్నామన్నారు. ఆ తర్వాత రెండు దశల్లో జిల్లాకు ఉత్తమ ప్రాంతానికి సంబంధించి మడకశిర బ్రాంచ్ కెనాల్‌కి నీరు ఎలా తీసుకెళ్లాలి, బైరవానితిప్ప, అప్పర్ పెన్నార్ ప్రాజెక్టుకు నీళ్లు ఎలా తీసుకెళ్లాలి అనేదానిపై కార్యచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవడం జరుగుతోందన్నారు. సాధ్యమైనంత తొందరలోనే ముఖ్యమంత్రి దృష్టికి ఈ విషయం తీసుకెళ్తామని, ఇందుకు సంబంధించి ముఖ్యమంత్రి ఇచ్చే ఆదేశాలు, సూచనలు తీసుకున్న తర్వాత జిల్లాకు సంబంధించి పకడ్బందీ ప్రణాళిక తయారు చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో హెచ్ఎన్ఎస్ఎస్ సిఈ నాగరాజు హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ దేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'అభయ'కు తక్షణ న్యాయం చేయాలి

మొదటిపేజి తరువాయి... న్యాయం చేయాలి. ఇలాంటి నేరాన్ని ఎవరన్న చేయాలంటే భయపడేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలి. విద్యార్థులు కూడా ధైర్యంగా న్యాయం కోసం ముందుకు వచ్చి పోరాడాలి. తమ గళాన్ని వినిపించాలి.

రక్షణ కోసం మహిళలు పోరాడాలి
జి.అమృత వర్షిణి, బీటెక్ ఫైనల్ ఇయర్, సిఎస్‌జి, పివికెకె కళాశాల

జి.అమృత వర్షిణి

భారతదేశంలో అర్ధరాత్రి నిర్భయంగా ఒంటరిగా ఆడది తన ఇంటికి క్షేమంగా వెళ్లినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్టు. కనీసం తను పని చేసే ప్రదేశంలో అయినా, తన అనుకున్న వారి మధ్యలో అయినా సురక్షితంగా ఉండగలిగే రోజు కోసం మహిళలు పోరాడాలి. ఇంకా భారతదేశంలో ఏ ముద్దబిడ్డ నిర్భయ, అభయ యువతుల్లాగా అత్యాచారా లకు, హత్యలకు గురికాకుండా ఉండేందుకు పోరాడాలి. అత్యాచారం, హత్యలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలి. నడిరోడ్డుపై ఉరి తీయాలి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలి
డి.రజియా, బీటెక్ సెకెండ్ ఇయర్, మెకానికల్, పివికెకె కళాశాల

డి.రజియా

కోల్‌కతాలో జరిగిన ఘటనపై వైద్య సంఘాలు, వైద్య కళాశాలల్లోని వైద్యులందరూ నిరసన వ్యక్తం చేస్తున్నారు. ప్రాణం పోసే వైద్యుల ప్రాణాలకే రక్షణ లేకపోతే ఈ చట్టాలు ఎందుకు..? వాటి వల్ల ఎవరికి లాభం. ఈ దుర్ఘటనపై పారదర్శక విచారణ జరిపించాలి. నిందితులకు కఠిన శిక్ష వేయాలి. భారతదేశం అంటే స్త్రీని గౌరవించే దేశం. ఇలాంటి మన దేశంలో ట్రైనీ వైద్యురాలిపై ఇలాంటి దాడి జరగడం దారుణం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇలాంటి ఘటనపై పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. దేశంలో ఉన్న యువతులకు, విద్యార్థులకు, మహిళలకు రక్షణ కల్పించాలి.

మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి సేవలు మరువలేనివి - మంత్రి సత్యకుమార్ యాదవ్



వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం రూరల్,
ఆగస్టు 16 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ధర్మవరం ఎమ్మెల్యే వై.సత్యకుమార్ యాదవ్, మాజీ ప్రధాని అటల్ బిహార్ వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా శుక్రవారం విజయవాడ మంత్రి స్వగృహం లో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. భారతదేశానికి ఆయన చేసిన సేవలు మరువలేనివి అంటూ కొనియాడారు. దేశానికి వాజ్‌పేపయి చేసిన సేవలు ఎన్నో రకాలుగా ఉపయోగపడ్డాయని తెలిపారు. ఆయన అడుగు జాడల్లో అందరూ నడవాలని మంత్రి తెలిపారు.

టిడిపి నేత వీరాంజినేయులు మృతి
- అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సంతాపం

టిడిపి నేత వీరాంజినేయులు

అనంతపురం, ఆగస్టు 16 ప్రభాతవార్త బ్యూరో

ఉమ్మడి అనంతపురం జిల్లాలో టిడిపి సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షులుగా పని చేసిన వీరాంజినేయులు శుక్రవారం మృతి చెందారు. ఇటీవల ఆక్సిడెంట్‌కు గురై కోమాలో చికిత్స పొందుతూ వీరాంజినేయులు మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులు దు:ఖ సాగ రంలో మునిగిపోయారు. వీరాంజినేయ మృతిపై పలువురు టిడిపి నేతలు సంతాపం వ్యక్తం చేశారు. టిడిపిలో ఎన్నో ఏళ్లుగా సేవలందించిన వీరాంజినేయులు లేకుండా జిల్లా తెలుగుదేశం పార్టీని ఊహించలేమని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి గత కొన్ని రోజులుగా ప్రాణాలతో పో రాడి ఆయన మరణించారు. ఈ వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదం జరిగిన సమయంలోతాను ఆసుపత్రికి వెళ్లి పరామర్శించానని, అప్పుడు ఆయన కోలుకుంటారనుకున్నామన్నారు. కానీ ఇలా మా అందర్నీ వదిలి వెళ్లిపోవడం చాలా బాధాకరమన్నారు. జిల్లాలో ఎక్కడ పార్టీ కార్యక్రమం జరిగినా, ఆయన గొంతు ప్రతిధ్వనిస్తుందని గుర్తు చేసుకున్నారు. ఆయన ప్రత్యర్థి పార్టీలపై చేసే విమర్శలు, నాయకుల గురించి చెప్పే తీరు అందర్నీ ఆకట్టుకుంటుందన్నారు. అలాంటి వ్యక్తి మరణించడం పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే అన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. వారి కుటుంబానికి పార్టీ కచ్చితంగా అండగా ఉంటుందన్నారు.

గ్రామ ప్రజలు ఎవరు తాగునీటీ సమస్యతో ఇబ్బందులు పడకుండా నీరు అందిస్తాం.....టిడిపి నాయకులు.

రాచానపల్లిలో నూతన బోరును వేస్తున్న టిడిపి నాయకులు.

అనంతపురం రూరల్, ఆగస్టు 16 ప్రభాతవార్త:

అనంత రూరల్ మండలం రాచానపల్లి పంచాయితీలో నివ సించే ప్రజలు ఎవరు తాగునీటీ సమస్యతో ఇబ్బందులు పడకుండా వారికి నీరు అందిస్తామని గ్రామ టిడిపి నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాప్తాడు నియోజ కవర్గంలోని ఏ గ్రామంలో ప్రజలు తాగునీటీ సమస్యతో ఇబ్బందులు పడకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ ఆదేశించడంతో ఆమె ఆదేశాల మేరకు శుక్రవారం రాచానపల్లి పంచాయితీలోని బోర్ల నుంచి నీరు సరఫరా కాక ప్రజలందరు ఇబ్బందులు పడుతుండంతో వెంటనే నూతన బోరును ఎస్సీ కాలనీ సమీపంలో వేయించడం జరిగిందన్నారు. నూతన బోరు నుంచి తాగు నీరు పైపులైన్ ఏర్పాటు పంచాయితీ కార్మికులతో చేయించి త్వరలో గ్రామ ప్రజలకు తాగునీరు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్, ఎంపిటిసి, గ్రామ టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డిఎస్సీ కోచింగ్

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 16 ప్రభాతవార్త

.డిఎస్సీ-2024 కోచింగ్ కొరకు స్కూల్ అసిసెట ంట్, యస్‌జిటి ఉద్యోగాల పోటీ పరీక్షల కొరకు గిరిజన అభ్యర్థులకు 2 1/2 నెలల నుంచి 3 నెలల పాటు శిక్షణ కొరకు అర్హత కలిగిన అభ్యర్థులనుంచి వినతులు స్వీకరిస్తోంది. డిగ్రీ, బిఇడి/ఇంటర్, డిఇడి/టెట్ పరీక్ష, వయసు ్ /మెరిట్ ఆధారంగా స్వీకరించబడునని ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.

మంత్రితో మర్యాద పూర్వకంగా కలిసిన ఎపి ఎన్‌జిఓ సంఘం నేతలు

మంత్రిని సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 16 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక, ప్రణా ళిక, వాణిజ్య పన్నులు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి ప య్యా వుల కేశవ్‌ని అనంతపురం జిల్లా ఎపి ఎన్ జిఓ సంఘము మర్యాద పూ ర్వకం గా కలిసి వారిని శాలు వాతో సత్కరి ంచడమైంది. ఈ కార్యక్ర మంలో ఎపి ఎన్జీఓ జిల్లా అధ్య క్షులు బి.చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి డి.చంద్రమోహన్, జిల్లా సహాధ్య క్షులు బి.వెంకటేష్ బాబు, జిల్లా ఉపాధ్య క్షులు రవికుమార్, ఉమెన్ వింగ్ చైర్మన్ ఎస్.జమీలా బేగం,జిల్లా ట్రెజరర్ ప్రవీణ్ కుమార్, జిల్లా జాయింట్ సెక్రెటరీలు టి.శ్రీనివాస్‌కుమార్, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను మంత్రి దృష్టికి

మంత్రిని సన్మానించి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 16 ప్రభాతవార్త

అనంతపురంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ని సభ్యులు కలవడం జరిగింది. ప్రైవేట్ స్కూల్ అసోషియేషన్ సమస్యల్ని మంత్రి సానుకూల ంగా విని ప్రభుత్వం దృష్టికి తీసుకుని పోయి మీ సమస్యల్ని పరిష్కరించ డానికి కృషి చేస్తానని చెప్పడం జరిగి ంది. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు కుసుమ పుల్లారెడ్డి, సెక్రెటరీ చంద్ర టౌన్ ప్రెసిడెంట్ శ్రీనాథ్ రవిశంకర్ ప్రసాద్‌రెడ్డి రవీంద్రరెడ్డి అన్వర్ జలీల్ రామ్మూర్తి లక్ష్మణ్ లోక్‌నాథ్, రామ్మో హన్, సంజీవరెడ్డి, సుబ్బారెడ్డి మిగతా సభ్యులందరూ కూడా పాల్గొని సమస్యల్ని వివరించడం జరిగింది.

మంత్రి పయ్యావులను కలిసిన దండు శ్రీనివాసులు

మంత్రి పయ్యావులకు పూల బొకేను ఇస్తున్న దండు శ్రీనివాసులు

శింగనమల, ఆగస్టు 16 ప్రభాతవార్త

జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో శుక్రవారం రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాస

04ATP16_04ATP16.qxd 16-08-2024 PM 11:02 Page 1

గంట గంటకు తుంగభద్ర డ్యాం వద్ద ఏం జరుగుతోందనేది అధికారుల బృందంతో పర్యవేక్షణ చేస్తున్నాం

- రైతులు ఎలాంటి ఆందోళన చెందరాదు.. తమ ప్రభుత్వం.. తాము రైతుల కోసం పని చేస్తున్నాం..
- రాష్ట్ర రెవెన్యూ మంత్రి పయ్యావుల కేశవ్

అనంతపురం, ఆగస్టు 16 ప్రభాతవార్త బ్యూరో

అత్యంత వేగంగా తుంగభద్ర డ్యాం గేట్ పునరుద్ధరించే ప్రక్రియ చెప్పడం జరుగుతోందని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు. శుక్రవారం అనంతపురం నగరంలోని ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో తుంగభద్ర డ్యాంలో గేట్ పునరుద్ధరించే ప్రక్రియపై మంత్రి మాట్లాడారు. ఈ సందర్భంగా మ ంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. తుంగభద్ర డ్యామ్‌లో గేట్ నెంబర్ 19వర దలో కొట్టుకొనిపోగా దానిని పునరుద్ధరించే కార్యక్రమం చేపడుతున్నా మన్నారు. గంట గంటకు డ్యామ్ వద్ద ఏం జరుగుతోంది అనేది అధికారుల బృందంతో పర్యవేక్షణ చేయడం జరుగుతోందన్నారు. గేట్ ఏర్పాటుకు సంబంధించి అడ్డంకిగా పైనున్న 30 టన్నుల కౌంటర్ వైట్‌ని శుక్రవారం కిందికి దించడం జరిగిందని, అతి జాగ్రత్తగా, సురక్షితంగా దానిని కిందకి తేవడం జరిగిందన్నారు. ఇది మొదటి విజయంగా మనం భావించ వచ్చున్నా రు. 30 టన్నుల బరువు ఎక్కడ పడుతుందో అనే ఆందోళన అధికారులం దరితో ఉండిందని, అది కింద పడితే డ్యామ్‌కు చీలికలు ప్రమాదం జరిగే పరిస్థితులు ఉండేవని, దానిని 90 టన్నుల క్రైన్లు రెండు పెట్టుకుని 30 టన్నుల బరువుని సురక్షితంగా కిందకు దించడం జరిగిందన్నారు. మిగిలిన స్ట్రక్చర్ తొలగింపు మొదలు పెట్టడం జరిగిందన్నా రు. గేట్లు దించడానికి పైనున్న స్ట్రక్చర్ తొల గింపు మొదలు పెట్టడం జరిగిందన్నా రు. గేట్లు దించడానికి పైనున్న స్ట్రక్చర్ ఏదైతే ఉందో హాయిస్ట్ అనే దానిని కట్ చేసి ఈరోజు సాయంత్రంలోపు దానిని ఓపెన్ చేయడం జరుగుతుందని, దాని తర్వాత సాధ్యమైనంత వరకు ఈరోజు సాయంత్రం లోపు తొలిగేటును దించ ేలా కార్యచచణ ప్రణాళికను సిద్ధం చేసుకోవడం జరిగిందని, ఈ కార్యక్రమం సజావుగా జరుగుతుందని భావిస్తున్నామన్నారు. మొదటి గేటు దించడం విజయవంతం అయితే రెండు, మూడు గేట్లు కూడా దించడంసులభతరం అవుతుందని నమ్మకంతో ఉన్నామన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందరాదని, ప్రభుత్వం, తామంతా రైతుల కోసం పని చేస్తున్నామని పేపర్కొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి పయ్యావులకేశవ్

వ్యవసాయ పనుల్లో ఎమ్మెల్యే పరిటాల సునీత బిజీ బిజీ

-స్వయంగా వరినాట్లు వేసి పరిటాల సునీత - వెంకటాపురంలోని తన వ్యవసాయ క్షేత్రంలో వ్యవసాయ పనులు ప్రారంభం - వరలక్ష్మి వ్రతం రోజు నేలతల్లికి పూజలు..కూలీలతో కలిసి పొలం పనుల్లో సునీత

రామగిరి, ఆగస్టు 16 ప్రభాతవార్త

రాజకీయాలు, ప్రజల సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యేగా బిజీ బిజీగా ఉండే పరిటాల సునీత.., శుక్రవారం వ్యవసాయ పనులు చేస్తూ కనిపిం చారు. రామగిరి మండలం వెంకటాపురంలోని తన సొంత వ్యవసాయ క్షేత్రంలో వరలక్ష్మి వ్రతం సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి వరి నాట్లు ప్రారంభిం చారు.కూలీలతో బురద మడిలోఓ దిగి.. వరి నాట్లు వేశారు. ఎంతో ఉత్సాహంగా కూలీలతో సమాన ంగా పని చ ఏస్తూ కనిపించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వ్యవ సాయ పనులను పర్యక్షిస్తూ గడి పారు. ఈ సందర్భంగా సునీత మాట్లా డుతూ.. తమ కుటుంబానికి మొదటి నుంచి వ్యవసాయం అంటే చాలా ఇష్ట మని, పరిటాల రవి ఉన్నప్పుడు ఎక్కు వ పొలం పనుల్లో ఉన్న విషయాన్ని గుర్తు చేసుకున్నారు. రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత ఓ వైపు ఎమ్మెల్యేగా ఉంటూనే మరోవైపు వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్లామన్నారు. తమ వ్యవసాయ క్షేత్రానికి వస్తే మనసు ఎంతో సంతోషంగా ఉంటుందని, ఇందులో ఉన్న సంతృప్తి మరెక్కడా లేదన్నారు. ఈ ఏడాది వర్షాలు సరిగా కురవకపోవడం బాధాకరమని, బోర్లు, బావుల కింద వ్యవసాయానికి ప్రభుత్వం నుంచి తగిన ప్రోత్సాహం అందిస్తామన్నారు.

వరినాట్లను ప్రారంభిస్తున్న పరిటాల సునీత

ఉరవకొండ తహశీల్దార్ కార్యాలయానికి ఐఎస్ఓ గుర్తింపు

- రాష్ట్రంలో ఐఎస్ఓ గుర్తింపు పొందిన తొలి తహశీల్దార్ కార్యాలయంగా రికార్డు
- మంత్రి పయ్యావుల కేశవ్ చేతుల మీదుగా ఐఎస్ఓ సర్టిఫికేట్ అందుకున్న తహశీల్దార్

ఉరవకొండ, ఆగస్టు 16 ప్రభాతవార్త

ఉరవకొండ తహశీల్దార్ కార్యాలయానికి ఐఎస్ఓ గుర్తింపు లభించింది. రాష్ట్రంలోనే ఐఎస్ఓ 9001:2015 సర్టిఫికేట్ అందుకున్న తొలి తహశీల్దార్ కార్యాల యంగా రికార్డు సృష్టించింది. జిల్లా కేంద్రం అనంతపురంలో గురువారం జరిగిన 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి ప య్యావుల కేశవ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ చేతుల మీదుగా ఉరవ కొండ తహశీల్దార్ ఎస్.మహ బూబ్‌బాషా ఐఎస్ఓ 9001:2015 సర్టిఫికేట్ అందుకున్నారు. ఏ ప్రభుత్వ కార్యాలయమైనా ఐ.ఎస్.ఓ గుర్తింపు పొందాలంటే 39 రకాల ప్రమాణాలు అవసరం. ఈ క్రమంలోనే మండల తహశీల్దార్‌గా ఈనెల 5వ తేదీన బాధ్యతలు చేపట్టిన ఎస్.మహబూబ్‌బాషా అనతికాలంలోనే ఐఎస్ఓ ప్రమాణాలకు అనుగుణంగా కార్యాలయంలో మా ర్పులు, చేర్పులు చేపట్టగలిగారు. సమావేశ మందిరాలవద్ద కోటేషన్లు/ పోస్ట ర్లు, గదులు/ఛాంబర్లు/క్యాబిన్ల కోసం గుర్తింపు బోర్డులు, హోదా బోర్డులు, ఆర్‌టీఐ ప్రదర్శన చార్ట్, రికార్డు రూమ్ నిర్వహణ, ఫైల్ డిస్పోజల్ డాక్యుమెంటేషన్, కంప్యూటర్స్ నంబరింగ్/సర్వీసు రిపోర్టు, నెట్‌వర్క్ రేఖా చిత్రం, ఇ-వేస్ట్ మేనేజ్‌మెంట్, ఫర్నిచర్/అల్మారాలు/ఫ్యాన్ల నంబరింగ్, ఐడీ కార్డులు, వ్యవస్థ పట్టిక, ఆఫీస్ ప్రొసీజర్ ఫ్లో, కొనగోలు రిజిస్టర్/రికార్డులు, విక్రేతల జాబితా, స్టాక్ రిజిస్టర్, తపాల్ రిజిస్టర్, మినిట్స్ రిజిస్టర్, సందర్శకుల నమోదు రిజిస్టర్, పిర్యాదుల రిజిస్టర్, రిసెప్షన్ టేబుల్, వర్క్ టైమింగ్ బోర్డు, లంచ్ టైమింగ్స్, ఫైర్ ఎన్‌ఓసీ, బిల్డింగ్ ఫిట్నెస్, లేఅవుట్, బిల్డింగ్ రిపేర్ల కోసం ప్రొక్యూర్‌మెంట్/కొనగోలు విధానం, నాణ్యత ప్రమాణాలు, గోల్స్/ఆబ్జెక్టివ్స్ (లక్ష్యాలు), కమిటీల ఏర్పాటు, పిర్యాదుల కమిటీ, పిర్యాదులు, ఫీడ్ బ్యాక్ బాక్సులు, నోటీసు బోర్డులు, సురక్షిత నిష్క్ర మరణ పాయింట్లు, ప్రథమ చికిత్స పెట్టె, సైన్ బోర్డులు, ఫోర్ ఐడెంటి ఫికేషన్ బోర్డులు, అత్యవసర సంప్రదింపు నంబర్ల జాబితా, శిక్షణల రిజిస్టర్, సిటిజన్ చార్ట్, మంచినీటి సౌకర్యం, సందర్శకులు వేచివుండే గది, దిన, వారపత్రికలు లాంటి అన్ని రకాల ప్రమాణాలను కార్యాలయంలో కల్పించారు. ఈ క్రమంలోనే ఈనెల 12వ తేదీన క్వాలిటీస్ మేనేజ్‌మెంట్ సిస్టం ఇంటర్నేషనల్ ఎస్‌జీఓకు చెందిన లీడ్ ఆడిటర్ కె.ఎస్.ఎన్.ప్రసాద్ బృందం తహశీల్దార్ కార్యాలయంను సందర్శించి ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించి ఐఎస్ఓ సర్టిఫికేట్ మం జూరుకు సిఫార్సు చేయగా కార్యాలయంకు ఐఎస్ఓ గుర్తింపు లభించింది.

ఉరవకొండ మండల తహశీల్దార్ కార్యాలయం

తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా

గ్రామాల పరిశుభ్రతే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం - ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం టౌన్, ఆగస్టు 16 ప్రభాతవార్త

గ్రామాలలో పారిశుద్ధ్యం, పరిశుభ్రతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ సా నిటేషన్ పథకం ద్వారా పంచాయితీలకు ట్రాక్టర్లు అందించి మరింత మెరు గైన పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకుంటామని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు. కళ్యాణదుర్గం మండలంలోని 7 పంచాయి తీలకు 7 ట్రాక్టర్లు, కంబదూరు మండలంలోని 5 పంచాయి తీ లకు 5 ట్రాక్టర్లు మంజూరు చేయడం జరిగింది. తర్వలోనే మిగి లిన మండ లాలకు స్వచ్ఛ ట్రాక్టర్లు అందిస్తామని ఎమ్మెల్యే అమిలినేని పేర్కొన్నారు. ఆర్టిసి బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే అమిలినేని కళ్యాణదుర్గం నుంచి బళ్లారికి కొత్త బస్సును ప్రజావేదిక వద్ద ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బా బు పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే అమిలినేని సురే ంద్రబాబు ఆర్టిసి డిపో మేనేజర్, సిబ్బంది పార్టీ నాయకులతో కలసి బస్సులో ప్రయాణించారు.

ఆర్టిసి బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ట్రాక్టర్లను అందజేస్తున్న దృశ్యం

ఎమ్మెల్యే దగ్గుపాటి ఇంట ఘనంగా వరలక్ష్మి వత్రం

- ప్రత్యేక పూజలు నిర్వహించిన దగ్గుపాటి సతీమణి శ్రీ లక్ష్మి
- మహిళలు పెద్ద ఎత్తున రాకతో పండుగ వాతావరణం

అనంతపురం అర్బన్, ఆగస్టు 16 ప్రభాతవార్త

వరలక్ష్మి వ్రతం సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఇంట పండుగ వాతా వరణం కనిపించింది. దగ్గుపా టి సతీమణి శ్రీలక్ష్మి తమ నివా సంలో వరలక్ష్మివ్రతాన్ని అత్యం త వైభవంగా నిర్వహించారు. ఈ పూజల్లో ఎమ్మెల్యే దగ్గుపాటి దంపతులు పాల్గొన్నారు. మహి ళలు బంధువులు పెద్ద ఎత్తున రావడంతో సందడి వాతావరణం కనిపిం చింది. లక్ష్మీదేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, వ్రతాన్ని నిర్వ హిం చారు. అనంతరం అందరికీ తీర్థప్రసాదాలు అందజేశారు. దగ్గుపాటి శ్రీలక్ష్మి మహిళ లందరికీ పసుపు, కుంకుమ, వాయనం ఇచ్చారు. అర్బన్ నియోజ కవర్గ ప్రజలందరికీ మంచి జరగాలని దగ్గుపాటి దంపతులు ఆకాంక్షించారు.

వ్రతం నిర్వహిస్తున్న దగ్గుపాటి దంపతులు

నియోజకవర్గ అభివృద్ధికై మంత్రి లోకేష్‌తో ఎమ్మెల్యే బేటి

కదిరి, ఆగస్టు 16 ప్రభాతవార్త

కదిరి నియోజకవర్గంలో చేపట్టవలసిన అభివృద్ధి కార్య క్రమాలపై రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌తో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ శుక్ర వారం బేటీ అయ్యారు. మం గళగిరిలోని లోకేష్ క్యాంపు కార్యా లయంలో లోకేష్‌తో ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ నియోజకవర్గంలో చేపట్టా ల్సిన అభివృద్ధి కార్యక్ర మాలు వాటికి అవసరమైన నిధులపై చర్చించారు.

మంత్రి నారాలోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే కందికుంట

నగరంలో నిర్బంధపు వసూళ్లు, బెదిరింపులు ఎక్కువయ్యాయి..

మొదటిపేజి తరువాయి... ఆ మహిళను పిలిపించి, దుర్భాషలాడుతూ.. ఒక తెల్లకాగితంపై సంతకం బలవంతంగా తీసుకుని బెదిరించారు. 4వ పోలీసుస్టేష్ సిసి పుటేజీలు మీరు పరిశీలిస్తే వాస్తవాలు వెల్లడవుతాయి. 13వ తారీఖున ఆమె ఇంటిపై అధికారులు దాడి చేయడం, వారితోపాటు ఓ ప్రజాప్రతినిధి ప్రైవేటు సైన్యం ఆ ఇంటిలో ప్రవేశించి, హెచ్చరిక చేస్తూ నీ కేసు మాఫీ అవుతుంది. మేము చెప్పినట్లు వీడియో ద్వారా బోయరంగా, మాజీ శాసనసభ్యునిపై ఆరోపించమని ఆదేశించారు. ఆమె భయంతో వివరించలేకపోయింది. ఇదే అదనంగా మున్నానగర్ సంబంధించిన ఎర్ర చొక్కా వేసుకున్న ఓ వ్యక్తి ద్వారా అతను బియ్యం అక్రమ వ్యాపారం చేస్తున్నట్లు, అందులో నా ప్రోత్సాహం ఉన్నట్లుగా ఒక వీడియో విడుదల చేశారు. మంచి కోసం పరితపిస్తే నీతి బాహ్యమన నేతలు ఇలాంటి ఆరోపణలు చేయించడానికి సాహసించడం ఆవేదన కలిగిస్తోంది. సమర్థవంతమైన పోలీస్ వ్యవస్థతో, సాంకేతిక పరంగా అభివృద్ధి చెందిన దేశంలో, ఈ రాష్ట్రంలో నిజమైన దోషులను శిక్షించాలి, న్యాయాన్ని అన్యాయంగా క్రమాన్ని అక్రమంగా, నిజాయితీని అవినీతిగా చిత్రీకరించే పరిస్థితులను చూస్తే భయం కలుగుతోందన్నారు. అధికార దుర్వినియోగంతో అధికారుల సహకారంతో గతంలో కొందరు నేతలు ప్రత్యర్థుల ఇళ్లలో బాంబులు పెట్టి లేదా గంజాయి లాంటి నిల్వ చేసి తప్పుడు కేసులు బనాయించే సంస్కృతిని నేను చూశాను. ఆ పరిస్థితి అనంతపురంలో రాకూడదని భావిస్తున్నాను. ముఖ్యమంత్రి పదేపదే కక్ష సాధింపులకు అవకాశం ఇవ్వం కానీ తప్పు చేసిన వారిని మాత్రం చట్టపరంగా శిక్షస్తామని తెలియజేస్తున్నారు. ఆ నిర్ణయాన్ని ఆదేశాల్ని అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆగస్టు 1వ తేది బుల్లె మాధవి ఫోన్ నెంబర్ 9550876573 (31, 1, 2 తేదీలలో) ఆమె ఫోన్ కాల్స్ వివరాలు, సంభాషణల వివరాలను మీరు పరిశీలిస్తే బెదిరించిన వ్యక్తులు ఎవరు వారి బంధుగణం ఎవరు లాంటి విషయాలతోపాటు ఎర్రచొక్కా వేసుకున్న వ్యక్తి ఎ వరి అనుచరుడు, లాంటి అనేక విషయాలు వెల్లడవుతాయి. జిల్లా అధికారిగా మీరు నిష్పక్షపాతంగా విచారణ చేయాలని అభ్యర్థిస్తూ గతంలో ఎన్నడూ లేని రీతిలో నగరంలో అనేక రకాల నిర్బంధ వసూళ్లు, బెదిరింపుల పర్వం మొదలైందని ప్రతి విషయంలో రాజకీయ జోక్యం అధికమైందన్నారు. స్థానికేతరులు అరాచక శక్తులు ముఠాగా ఏర్పడి, అధికారం అనే ఆయుధం బూచిని చూపిస్తూ, వ్యవస్థల్ని నిర్వీర్యంచేయాలని, వ్యాపారస్తులు, కాంట్రాక్టర్లు, ఇతర వ్యక్తుల్ని బెదిరించే సంస్కృతికి శ్రీకారం చుట్టారన్నారు. ఇలాంటి ఉదంతాలు నా దృష్టికి వస్తున్నాయన్నారు. అవసరం అని మీరు భావిస్తే వాటి ఆధారాలు అందజేయడానికి సిద్ధంగాఉన్నామన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయప్రధాన కార్యదర్శి బాధ్యతలో ఉన్న, అవే సంస్థ అధ్యక్షుడిగా ప్రజల్ని చైతన్యపరిచే బాధ్యత తీసుకున్న, నాలాంటి వ్యక్తికే నీతిబాహ్యమైన చర్యల్ని అంటగట్టే సాహసం చేస్తున్న ప్రైవేట్ సైన్యాలు నగరంలో బలపడితే, సామాన్య ప్రజల పరిస్థితి ఏంటని బాధ కలుగుతోందన్నారు. 1983 నుంచి 40 సంవత్సరాల నా సుదీర్ఘరాజకీయ ప్రయాణంలో మచ్చలేని జీవితతం నాది. 9550876573 నెంబర్ కాల్ డేటా సంభాషణలను పరిశీలించాలని కోరారు. వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆ ఆలయంలో భారీ సంపద..ఉందా..!

- ఆలయ ముఖ ద్వారానికి నాగలబంధం కలిగిన పురాతన ఆలయం ఎక్కడ ఉంది..? - అసలు ఆలయ చరిత్ర ఏంటి..? - ఆశ్చర్యానికి ఆ ఆలయం ప్రతిరూపం..- పురాతన ఆలయాలకు పుట్టినిల్లుకుందుర్పి.. - ఏక రాతిశిలపై సతీసమేతంగా వెలసిన కృష్ణ దేవరాయలు.. - ఆలయంలో నిధికి నాగ సర్పాలు కాపలానా..?

కుందుర్పి, ఆగస్టు 16 ప్రభాతవార్త

విజయనగర సామ్రాజ్యపాలనలో ఓ ఆలయం ఓ వెలుగు వెలిగింది ఆప్రాంతం. దేవుని మీద ఉన్న అపా రమైన భక్తి భావాన్ని చాటుకోవ డానికి ఆ నాటి కాలంలో రాజులు అనేక ఆల యాలను నిర్మించారు. అలా నిర్మిం చిన ఆలయాలలో అనేక రహస్యాలు నేటికీ ఒక్కొక్కటిగా బయటప డుతున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని మండల కేంద్రమైన కుందు ర్పి గ్రామంలో ఆలయాలు ఎక్కువగా ఉన్నాయి. ఆ కుందుర్పి గ్రామాన్ని పురాతన ఆల యాలకు పుట్టినిల్లుగా చరిత్రకారులు పేర్కొంటారు. ఆ గ్రామానికి సమీపంలో చిన్న కొండ ప్రాంతంలో కీ.శే. 16వ శతాబ్దం మధ్య కాలంలో విజయనగర సామ్రాజ్య రాజులు నిర్మించిన ఒక ఆలయం ఉంది. ఆ ఆలయం గర్భగుడిలోపల శివలింగం ఉందని కొందరు, ఇంకొందరు శ్రీకృష్ణదేవరాయలు సతీసమేతంగా వెలసిన ఆలయమని చెబుతూ ఉంటారు. అయితే ఈ ఆలయాన్ని చూసిన వారు ఎవరైనా ఆశ్చర్య పోవాల్సిందే. ఒరిస్సాలోని పూరీ జగన్నాథ ఆలయానికి, అనంత పద్మనాభ స్వామి ఆలయ ముఖ ద్వారానికి నాగబంధం ఉండటంతో సర్వత్ర ఉత్కంఠ నెలకొంది. గర్భగుడిలోని రహస్య గదిని కొంత మంది వ్యక్తులు స్వాధీనం చేసుకుని తాళాలు వేసుకోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. శ్రీ కృష్ణదేవ రాయల రాజుల కాలం నాటి ఆలయం కావడంతో అందులో నాగబంధం ఉండడం కారణంగా, భారీగా సంపద ఉండే అవకాశం ఉందని చరిత్ర కారు లు అంటున్నారు. అయితే ప్రస్తుతం ఈ ఆలయం పురావస్తూ శాఖ అధికా రుల నిర్లక్ష్యం కారణంగా పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంటుంది. విజయనగర సామ్రాజ్యాన్ని గెలుపు పథంలో నడిపించిన శ్రీ కృష్ణదేవరా యలు తమ ఇద్దరు భార్యలైన తిరుమల దేవి, చిన్నదేవితో కలిసి ఉండే ఏకశిల రాతి శిల్పం ఉండడంతో ఈ ఆలయం మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. కృష్ణదేవరాయలు తమ ఇద్దరు భార్యలతో ఉన్న శిల్పం కలిగిన మూడవ ఆలయంగా పేర్కొన్నారు. మన పక్క రాష్ట్రం కర్ణాటకలోని ఒకటి హంపి, రెండవది తిరుమల తిరుపతి, మూడవది కుందుర్పిగా కృష్ణ దేవరాయలుగా చెప్పుకుంటుంటారు. రాయలకాలంలోని వజ్రాలు, వైడుర్యాలు, రత్నాలు రాశులు పోసి అమ్మారని చరిత్ర తెలియజేస్తోంది. దీంతో ఆ ప్రాంతంలో ఆలయం చుట్టూ పురాతన సంపద ఉంటుందని పలువురు అంటున్నారు. పురావస్తు శాఖ అధికారులు ఈ ప్రాచీన ఆలయ పరిసర ప్రాంతాలలో తవ్వకాలు చేపడితే అనేక చారిత్రక ఆధారాలు బయటపడే అవకాశం లేకపోలేదని భక్తులు అభిప్రాయపడుతున్నారు. ఆలయ గోడలపై ఉ న్న విగ్నేశ్వరుడు, పులి చిత్రం, చేప, నెమలి, అంజన్న, వంటి శిల్పాలు కృష్ణ దేవరాయల పాలనకు అద్దం పట్టేలా ఉంటాయి. ఇంతటి అపార ఘన చరిత్ర తగిన ఆలయాన్ని ఆంధ్రప్రదేశ్ పురావస్తు శాఖ జాబితాలో చేర్చుకోవడ ంతోసర్వత్రత విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శ్రీ కృష్ణ దేవరాయల కీర్తి ప్రతిష్టలను దెబ్బతీసే విధంగా ఏపి రాష్ట్ర పురావస్తు శాఖ అధికారులు వ్యవహరిస్తున్నారని పలువురు భక్తు లు మండి పడుతున్నారు. ఆలయం చుట్టూ నాగసర్పాలు చెక్కడంతో అక్కడ ఉన్ననిధికి నాగసర్పాలు కాపలాగా ఉంటాయని స్థానిక ప్రజలు భావి స్తున్నారు. నాగబంధం అంటే ఏమిటి..? పురాణాల ప్రకారం ప్రాచీన కాలం లో రాజులు ఏదైనా బంగారం, వజ్రాలు, విలువైన సంపదను ఆలయా ల్లోని రహస్య గది నేలమాలిగల్లో పెట్టి ఆ గదికి తాంత్రిక మంత్రాలతో నాగబంధం వేసేవారని చరిత్ర తెలుపుతోంది. దీంతో అది శక్తివంతంగా ఉండడంతోపాటు ఎవరైనా ముట్టుకుంటే నాగబంధం ప్రభావంతో మరణిస్తారని వేద పండితులు వెల్లడిస్తున్నారు. మండల కేంద్రమైన కుందుర్పిలోని ఈ పురాతన ఆలయానికి నాగబంధం ఉండడంతో చరిత్ర కారుల్లో పలు సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. కృష్ణ దేవరాయల కాలం నాటి భారీ సందప ఆలయంలో ఉండే అవకాశం ఉన్నట్లు చర్చించుకుంటున్నారు. కృష్ణ దేవరాయల వారు ఇక్కడ పూజ, పురస్కారాలు తక్కువైనా ఆలయాలకు భద్రత పటిష్టంగా ఉంటుందని భావించారని తెలుస్తోంది. తద్వారా ఈ గ్రామంలో అనేక దేవాల యాలు వెలిశాయి. కుందుర్పి కేంద్రంగా ఇతర గ్రామాలలో ఆలయాలు నిర్మాస్తే ఇక్కడ నుండే దేవత విగ్రహాలనున తరలించేవారు అని గ్రామ పూర్వీకుల పెద్దల ద్వారా సమాచారం తెలిసింది. ఇప్పటికైనా ఏపి పురావస్తు శాఖ అధికారులు నిద్రవ్యవస్థను వీడి ఆలయానికి వెంటనే రక్షణ కల్పించి పునరుద్ధరణ పనులు చేపట్టాలని ప్రజలు చరిత్రకారులు కోరుకుంటున్నారు.

ఆలయం, చుట్టూ శాసనాలు, శిల్పకళా దృశ్యాలు

మానేపల్లిలో కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే బాలయ్య

లేపాక్షి, ఆగస్టు 16 ప్రభాతవారత

మండలంలోని మానేపల్లిలో వెలసిన కొండారి ఆశ్రమంలో 16 లక్షల రూపాయల ఎంపి నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ ను హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ శుక్రవారం ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో ఎంపి నిధులు కమ్యూనిటీహాల్ నిర్మాణానికి 16 లక్షల రూపాయల నిధులు మం జూరు అయ్యాయి. ఎంపి నిధులతో కమ్యూనిటీహాల్ నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కమ్యూనిటీ హాల్‌ను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ సందర్భ ంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. గత ఐదేళ్ల కాలంలో గత ప్రభుత్వం చేసింది ఏమిలేదన్నారు. అభివృద్ధిలో రాష్ట్రం 16 ఏళ్లు వెనక్కు వెళ్లిందన్నారు. ప్రస్తు తం తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రాష్ట్రాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమ ంలో తెలు గుదేశం పార్టీ మండల జయప్ప, మాజీ ఎంపిపి ఆనంద్‌కుమార్, నాయకు లు మారుతిప్రసాద్‌రెడ్డి, పాపిరెడ్డి, మాలక్క, సడ్లపల్లి అశ్వర్థనారాయణ, సిరి వారం కిష్టప్ప, సూర్యప్రకాష్, మైదుగోళం రామచంద్రారెడ్డి, నాగలిం గారెడ్డి, కొండూరు ప్రభాకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్, బయన్నపల్లి రవి, దైరీ శ్రీరామప్ప, ఆవులరెడ్డి, మంజు, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కమ్యూనిటీహాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

ప్రజా సంక్షేమమే నా లక్ష్యం.... ఎమ్మెల్యే కాలవ

రాయదుర్గం రూరల్, ఆగస్టు 16 ప్రభాతవార్త:

ప్రజా సంక్షేమమే నా లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పే ర్కొన్నారు. శుక్రవారం రాయదుర్గంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిపి విద్యా వతి అధ్యక్షతన సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై య్యారు. అనంతరం ఆయన సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజల అభివృద్ధి కోసం ప్రజా సంక్షేమం కోసం నేనెప్పుడూ ముందుటానని, ఎల్లవే ళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని, ప్రజా అభివృద్ధి నాలక్ష్యమని ఆయన పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రజా ప్రతినిధులు, అధికారులు అందరూ సహకరించాలన్నారు. గత వారం, పది రోజులు సిసిరోడ్డు నిర్మా ణం కోసం మండలానికి నిన్న రిజల్ట్స్ నిధులు రూ.మూడు, నాలుగు కోట్లు మంజూరుకి ప్రతిపాదనలు పంపించామని, దాదాపు 18కోట్ల మేరా ఖర్చు చేస్తామని, ఇలా ఆరు నెలలకు ఒకసారి గ్రామ అభివృద్ధి కో సం ఖర్చు చేయడం జరుగు తుందన్నారు. రైతులకు ఎల ్లవేళలా అండగా ఉండి రైతు ల కు సబ్సీడి విత్తనం, డ్రిప్ ఇరిగేషన్, ఇన్‌పుట్ సబ్సీడి ఇలా అన్ని రకాలుగా రైతులకు ఎన్న డు అంగా ఉంటామని, రైతన్న లను ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి, మల్లికార్జున, ఇన్ చార్జ్ ఎంపిడిఓ చిక్కన్న, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

అక్రమంగా తరులుతున్న పిడిఎస్ బియ్యం పట్టివేత

- పోలీసుల అదుపులో పిడిఎస్ బియ్యం అక్రమ రవాణాదారులు, వాహనం పిడిఎస్ బియ్యం సీజ్

పామిడి, ఆగస్టు 16 ప్రభాతవార్త

నిరుపేదలను ఆదుకోవాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రభుత్వ చౌకాదాన్యపు డిపోల ద్వార సరఫరా చేస్తున్న పిడిఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న అశోక్‌లైలాండ్‌ను గురువారం పోలీసులు పట్టుకుని పోలీ స్‌స్టేష న్‌కు తరలించారు. గత కొన్నేళ్ళుగా అక్రమ రవాణాదారులు జిల్లా వ్యాప్తింగా ప్రతే్యకించి పామిడిలో పిడిఎస్